నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
హైదరాబాద్
1
శనివారం ఫిబ్రవరి 22, 2025 www.navatelangana.com

ఆటో కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి'

● తెలంగాణ రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ఐఎన్‌టీయుసీ నాయకులు, జాతీయ అధ్యక్షులు డా.జి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఐఎన్‌టీయుసీ ప్రధాన కార్యదర్శి ఏరగా ని నాగన్న గౌడ్ నేతృత్వంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్. నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్, జంట నగరాల ఐఎన్ టీయుసీ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.దయానంద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సమస్యలపై పలుమార్లు మంత్రికి వినతి పత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు. ఐఎన్ టీయుసీ చొరవతో త్వరితగతిన సమస్యలు ఎలక్షన్ కోడ్ అనంతరం రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డితో చర్చించి, పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మ్యాన్ హెూల్స్‌పై అధికారులు దృష్టి సారించాలి

● కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అధికారులు మ్యాన్‌హెూల్స్‌పై దృష్టి సారించి ఎప్పటి సమస్య అప్పుడు పరిష్కరించాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని బాపునగర్, న్యూ పటేల్ నగర్, నరేంద్ర నగర్‌లో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ స్థానిక అధికారులతో పలు ప్రాంతాల్లో మ్యాన్ హెూల్స్ కుంగిపోయినటు వంటి ఏరియా లో పర్యటించి పాడైపోయిన మ్యాన్ హెూల్ ని చూపించి వెంటనే సమస్యని పరిష్కరించవలసిందిగా తెలియజేశారు,. వెంటనే స్పందించిన అధికారులు సంబంధిత సిబ్బందిని పిలిపించి సాయంత్రంలోగా చేయిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రదీప్ కుమార్,వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కన్నం జాకీ బాబు, మహేష్ ముదిరాజ్, స్థానిక బస్తీ వాసులు రాములు గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

'చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-హిమాయత్ నగర్

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మార్చి 12, 13వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నీరిడీ భూపేష్ సాగర్‌లతో కలిసి 'ఛలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 76 ఏండ్లు దాటుతున్నా ఓబీసీలకు రాజకీయ స్వతంత్రం రాలేదన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధించడం ద్వారా మాత్రమే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ మాట్లాడుతూ ఓబీసీ డిమాండ్ల సాధన కోసం మార్చి 12, 13వ తేదీల్లో ఛలో ఢిల్లీ ఏపీ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఓబీసీ డిమాండ్లపై మేధావుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు సి.రాజేందర్, పి.ప్రసాద్, శ్రీనివాస్ రావు, రాజశేఖర్, అనంతయ్య, చల్లా వరుణ్, లక్ష్మణరావుతో పాటు దాదాపు 40 పైగా కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవకతవకలకు చెక్!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఎఫ్‌ఆర్ఎస్' అమలు
● మొదటగా టేక్ హెూం రేషన్ లబ్దిదారులకు..
● దశల వారీగా మిగతవారికి అమలు
● మొత్తం 970 కేంద్రాలు.. 65వేల మంది లబ్దిదారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ విధానం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరగ్గా.. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య, సరుకుల వివరాల నమోదులో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు లబ్దిదారుల గుర్తింపునకు చర్యలు చేపడుతున్నారు. తొలిదశలో టేక్ హెూం రేషన్ (టీహెచ్ఆర్) లబ్ధిదారులకు మాత్రమే ఫేస్ రికగ్నిజేషన్ అమలు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. టీహెచ్ఆర్ లబ్దిదారుల నమోదు ప్రక్రియ ముగిసిన తర్వాత మిగతా వారికి వర్తింపజేసే ఆలోచనలో ప్రభుత్వ ఉంది.

అంతా మెనూ ప్రకారమే..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. అదేవిధంగా ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. కాగా లబ్ధిదారులందరికీ మెనూ ప్రకారం ప్రతి రోజూ ఇక్కడ ఆహార పదార్థాలు అందిస్తారు. పిల్లలకు అక్షరాభ్యాసంతో పాటు ఆటపాటలతో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గర్భిణులు, మూడేండ్లు పైబడిన పిల్లలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుండగా, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేండ్ల లోపు పిల్లలకు టేక్ హెూం రేషన్ (టీహెచ్ఆర్) విధానంలో అంగన్‌వాడీ టీచర్లు ఆహార పదార్థాలు ఇంటికి ఇస్తున్నారు. అయితే అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ, పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యంతో పాటు అవకతవకలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రతిరోజు ఆయా కేంద్రాలకు హాజరైన పిల్లలు, ఆహార పదార్థాలను తినేందుకు వచ్చే బాలింతలు, గర్భిణుల ఫొటోలను మొబైల్ ఫోన్ ద్వారా పోషన్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే టీహెచ్ఆర్ లబ్దిదారులకు మాత్రం నమోదు విధానం లేకపోవడంతోపాటు పిల్లల్లో శారీరక ఎదుగుదల లోపిస్తున్నట్టుగా గుర్తించడంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఫేస్ రికగ్నిజేషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈమేరకు తొలి దశలో టీహెచ్ఆర్ లబ్ధిదారుల జాబితాకు వారి ఫొటోలను ఈ-కేవైసీ విధానంలో జత చేస్తున్నారు. గడిచిన నెల రోజులుగా హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ జరుగుతోంది.

ఈ-కేవైసీతో.. పెరగనున్న పారదర్శకత..!

పోషణ్ అభియాన్ ట్రాకర్‌లో కొత్తగా ప్రవేశ పెట్టిన ఈ-కేవైసీతో లబ్దిదారులకు కరెక్టుగా పౌష్టికాహారం అంది వారి ఆరోగ్యానికి దోహదపడడంతో పాటు అవకతవకలకు చెక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని ఏడు నెలల వయసు నుంచి 3 ఏండ్లలోపు పిల్లలకు, కేంద్రాలకు రాలేని



శారీరక పరిస్థితులున్న గర్భిణులు, బాలింతలకు ప్రతీ 25 రోజులకు ఒకసారి బాలామృతం, కోడి గుడ్లు ఇంటికి ఇస్తారు. మిగతావారు కేంద్రాలకు వచ్చి మెనూ ప్రకారం ఇచ్చే ఆహార పదార్థాలు తినాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అందరి లబ్ధిదారుల ఆధార్ నెంబర్, ఫొటోలు, ఇతర వివరాలను పోషణ అభియాన్ ట్రాకర్‌లో ఫీడ్ చేయగా.. ప్రస్తుతం అమలవుతున్న ఈ-కేవైసీలో టీహెచ్ఆర్ లబ్దిదారుల ఫొటోలను అంగన్‌వాడీ టీచర్లు క్యాప్చర్ చేసిన వెంటనే లబ్ధిదారుడి రిజిస్టర్డ్ మొబైల్‌కు ఓటీపీ వెళ్తుంది. ఓటీపీని ధ్రువీకరించగానే ఈ-కేవైసీ నమోదు పూర్తవుతుంది. ఈ-కేవైసీ నమోదైన వారికి టీహెచ్ఆర్ ఇవ్వనున్నారు. ఈ విధానంతో టీహెచ్ఆర్ పంపిణీ పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కొత్త వెర్షన్‌తో.. పెరిగిన సమస్యలు..

పోషణ్ అభియాన్ ట్రాకర్ ప్రారంభంలోనే అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్, ప్రత్యేక సిమ్ కార్డు అందజేసింది. కానీ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఈ ఫోన్‌లను అప్‌డేట్ చేయలేదు. దీంతో టీచర్లు తమ సొంత ఫోన్లోనే పనులు పూర్తి చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమగ్ర వివరాలను మొబైల్‌లోనే నమోదు చేస్తున్నారు. ప్రతిరోజూ టీచర్లు పోషణ్ ట్రాకర్ యాప్‌లోని వివిధ యాప్‌లపై పని చేయాల్సింటుంది. దీనికితోడు టీహెచ్ఆర్ లబ్ధిదారుల ఎఫ్ఆర్ఎస్ అమలుతో టీచర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. సరియైన శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో ఈ-కేవైసీ నమోదు వారికి ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా నెట్‌వర్క్ సమస్యతో ఈ-కేవైసీ పూర్తి చేయలేకపోతున్నారు. ఒక్కొక్క లబ్దిదారుడికి వివరాల నమోదుకు కనీసం నాలుగైదు సార్లు చేయాల్సి వస్తుందని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ముఖ్యంగా 22.3 కొత్త వెర్షన్ ప్రవేశపెట్టిన దగ్గర నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరిస్తున్నారు. దీంతో టీహెచ్ఆర్ లబ్దిదారుల ఈ-కేవైసీ ప్రక్రియ పనులు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. వాస్తవానికి ఈనెల చివరివరకు పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించగా.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులతో 30శాతం కూడా పూర్తికాలేదని తెలుస్తోంది. ఈ-కేవైసీ నమోదు సందర్భంగా వస్తున్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు జిల్లా అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అయిదు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 970 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోల్కొండ, చార్మినార్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 65,494 మంది లబ్దిదారులు ఉన్నారు. ఇందులో దాదాపు 10,772 మంది ఎఫ్ఆర్ఎస్ పూర్తిచేయగా.. ఫేస్ క్యాప్చర్‌తో పాటు ఈ-కేవైసీ 7,168 మంది, ఆధార్‌తో మరో 2,793 మంది పూర్తి చేయగా.. మరో 35-40వేల మంది లబ్దిదారులకు సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియను ఈనెల చివరివరకు పూర్తి చేసి.. దశలవారీగా ఇతర లబ్దిదారుల నమోదు ప్రక్రియను చేపట్టనున్నామని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

ఎండాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

● మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజలు ఎండ కాలంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని బొగ్గులకుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న అన్నారు. శుక్రవారం బొగ్గుల కుంటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు 0-10 ఏండ్ల లోపు పిల్లలకు వివిధ దశల్లో అందించే వ్యాక్సిన్‌లు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎండాకాలంలో వేడిని తట్టుకునేందు కు ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రజలు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. రోజుకు కనీసం ఐదు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలన్నారు. డిహైడ్రేషన్‌కు గురికాకుండా చూసు కోవాలన్నారు. పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు తల్లి పాలు తప్పనిసరిగా పట్టించాలని చెప్పారు. వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. ఎండలకు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలనుకుంటే వెంట గొడుగు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలకు ఓఆర్ఎస్‌పాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందుల ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అంది స్తున్నామన్నారు. తమ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎన్‌సీడీ కార్యక్రమం కూడా నిర్వహిసున్నామన్నారు.

మంచినీటి లోప్రెషర్ సమస్యను త్వరగా పరిష్కరించండి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ గాంధీనగర్ డివిజన్ వ్యాప్తంగా ఉన్న మంచినీటి సరఫరా లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ శుక్రవారం జలమండలి ఎం.డి అశోక్ రెడ్డిని తన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చాలా కాలంగా గాంధీనగర్ డివిజన్‌లోని ప్రజలు తీవ్రతరంగ ఎదుర్కుంటున్న మంచినీటి సరఫరా లో ప్రెషర్ సమస్యను పరిష్కరించడంలో వాటర్ వర్క్స్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. మంచినీటి సమస్యను అధికారుల దృష్టికి తెచ్చిన అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తాగు నీటి లోప్రెషర్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారనీ, ప్రస్తుతం ఇలా వుంటే, రానున్న వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి తో ప్రజలు ఏమవుతారని ప్రశ్నించారు. కావున వెంటనే ఎం.డి తమ సమస్యపై స్పందించి, సమస్యను పరిష్కరించే దిశగా ప్రత్యేక దృష్టి వహించాలని కోరారు. జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించి తక్షణమే వాటర్ వర్క్స్ జీ.ఎం, డీ.జీ.ఎం, మేనేజర్‌లకు సమస్యను పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేస్తానని, త్వరలో ప్రజలకు మంచినీటి సరఫరా లోప్రెషర్ సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిశ గా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

28న ఆల్ ఇండియా సదస్సును జయప్రదం చేయండి

● సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు కేజీ.రామచందర్



నవతెలంగాణ-ముషీరాబాద్

కార్పొరేట్ శక్తులకు మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఫెడరలిజం కోసం 28న ఢిల్లీలో ఆల్ ఇండియా సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎం ఎల్) మాస్ లైన్ కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు కే.జీ రామచంద్ర తెలిపారు. శుక్రవారం విద్యానగర్ లోని మార్క్స్ భవన్‌లో సీపీఐ (ఎం ఎల్) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు కే .జీ రామ చందర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రమా, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ఎస్-ఎల్.పద్మ, ఎం.అన్వేష్, సదానందం హాజరయ్యారు ఈ సందర్భంగా కే జీ రామచంద్రర్ మాట్లాడుతూ సబ్కా సాత్ సబ్కా వికాస్ అని ప్రగల్భాలు పలికి 10 సంవత్సరాల తర్వాత అది కార్పొరేట్‌గా సాత్ కార్పొరేట్‌గా వికాస్ గా మారిపోయిందన్నారు. కంపెనీల లాభాలు 15 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని ధనికుల పేద ప్రజల మధ్య అసమానతలు మరింత పెరిగాయి ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసరాల ధరలు పెరిగిపోయాయి. కనీస మద్దతు ధర లేదు సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని విద్య వైద్యానికి జీడీపీలో ఆరు శాతం మూడు శాతం కేటాయించాలని డిమాండ్‌కు స్పందన లేదన్నారు. భారతదేశం అనేక జాతుల సమ్మేళనం అని దేశభక్తిని నిండా పులుముకున్న చందంగా మాట్లాడే మోడీ బీజేపీలు అమెరికా నుండి అక్రమ వలస ప్రజలను బేడీలు వేసి యుద్ధం విమానాల్లో తరలిస్తుంటే ప్రధాని నోటి నుండి ఒక్క మాట కూడా రాలేదని పైగా అమెరికా అధ్యక్షులు నాకు క్లోజ్ ఫ్రెండ్ అని చెప్పడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 28న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కరపత్రాలు పోస్టర్స్ సభలు సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి

పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎస్.వి శ్రీకాంత్, పొడపంగి నాగరాజు



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థుల చావులకు కారణమవుతున్న, శ్రీ చైతన్య తదితర కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్రఅధ్యక్షప్రధాన కార్యదర్శి ఎస్.వి శ్రీకాంత్, పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎస్.వీ శ్రీకాంత్, పొడపంగి నాగరాజు లు హాజరై మాట్లాడుతూ ఖమ్మం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో యోగా నందిని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఆత్మహత్యకు కారకులైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించా ని బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మహేష్, భువనగిరి మధు, డి.శ్రీకాంత్, జె.రాజేశ్వర్, మంద నవీన్, సంతోష్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జే.తిరుపతి, జీ.మస్తాన్, డి.ప్రణయ్, కే.శ్రీనివాస్, గుర్రం అజయ్ కోశాధికారి రాణా ప్రతాప్ కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, గౌతమ్, ఆసిఫ్ ఝాన్సీ, సింహాద్రి, శ్రీను, గణేష్, సందీప్, ప్రిన్స్, చంద్రరావు, మహేష్,రాజేష్, ఉదయ్, వెంకటేష్, గణేష్, వెంకటేష్, తదితరులున్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బొగ్గులకుంట ప్రధాన రహదారి దేవాలయ కమిషనర్ కార్యాలయం ఎదురుగా మనోరంజని ప్రభుత్వ పాఠశాల గోడ ను అనుకొని ఉన్న పుట్ పాత్ మట్టి దిబ్బలు, వ్యర్థాలు గత కొన్ని రోజులుగా పేరకపోయిన వ్యర్థాలతో పుట్‌పాత్‌పై నడిచే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు వాటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ఆస్తి పన్ను ఫిర్యాదుల పరిష్కారాన్ని సద్వినియోగించుకోవాలి

● డిప్యూటీ కమిషనర్ జయంత్

నవతెలంగాణ-ధూల్ పేట్

ఈ నెల 22 నుంచి కొనసాగే ఆస్తి పన్ను ఫిర్యాదుల పరిష్కారాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని మలక్ పేట్ సర్కిల్ - 6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ సర్కిల్-6 పరిధిలోని ఆస్తి పన్ను ఫిర్యాదులు ఈ నెల 22వ తేదీ నుండి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 1గం. వరకు కొనసాగుతుందన్నారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రోడ్‌లో ఆస్తిపన్ను ఫిర్యాదుల పరిష్కారానికి పరిష్కారం నిర్వహించబడుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, పన్ను సమస్యలను పరిష్కరించాలని కోరారు.

23న మహిళలకు ఉచిత వైద్య శిబిరం

● హైదరాబాద్ డెక్కన్ బ్రహ్మ సమాజ్ అధ్యక్షులు చల్ల కేశవచంద్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మహిళల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించే మహత్తరమైన కార్యక్రమాన్ని బ్రహ్మ సమాజ్ మందిర ఆవరణలో 23న నిర్వహించనున్నట్లు హైదరాబాద్ డెక్కన్ బ్రహ్మ సమాజ్ అధ్యక్షులు చల్ల కేశవచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 5న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మంజుల అనగాని చేతుల మీదుగా ఆయుష్ కల్ప విమెన్ హెల్త్‌కేర్ క్లినిక్ తొలి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. తరువాత తమ తదుపరి కార్యక్రమంగా 23న ఆరోగ్య సంరక్షణకు పరిమిత అవకాశాలు ఉన్న నిరాశ్రయులు, వృద్ధాశ్రమ నివాసితుల కోసం ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్‌ల ద్వారా వైద్య పరీక్షలు, సేవలు అందించబడతాయన్నారు. అవసరమైన రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ (యూఎస్జీ) స్కాన్, అవసరమైన మందులు పూర్తిగా ఉచితంగా అందించబడతాయన్నారు. ఈ వైద్య సేవల ద్వారా అధిక సంఖ్యలో ఆసక్తి గల, అర్హులైన వారు లబ్ధి పొందాలన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది

● బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి గౌడ్

నవతెలంగాణ-ముషీరాబాద్

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని బీఆర్ఎస్ యువ నాయకుడు సాయి గౌడ్ అన్నారు. శుక్రవారం తన జన్మదిన సందర్భంగా సాయి గౌడ్ టీం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి గౌడ్ మాట్లాడుతూ సాయి గౌడ్ టీం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజల ఆదుకోవడంలో ముందుంటామన్నారు.



తెలంగాణ బాలోత్సవం పిల్లల లైబ్రరీ ప్రారంభానికి సిద్ధం



నవతెలంగాణ-ముషీరాబాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో "పుస్తకాలతో హాయ్ హాయ్ - స్మార్ట్‌ఫోన్లకు బై బై" నినాదంతో పిల్లల లైబ్రరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవం ప్రతినిధులు మాట్లాడుతూ నేటి యుగంలో చిన్నారులు మొబైల్ స్క్రీన్లలో మునిగిపోతున్నారు. టాబ్లెట్లు, ఫోన్లు చిన్నారుల చేతుల్లో పట్టాలుగా మారాయి. దీని వల్ల ఊహాశక్తి తగ్గిపోతోందని ప్రశ్నించే ధోరణి మందగిస్తోంది. ఈ పరిస్థితిని మారుస్తూ పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంచే లక్ష్యంతో బాలోత్సవం చిల్డ్రన్స్ లైబ్రరీను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ గ్రంథాలయంలో అన్ని భాషల్లో పిల్లలకు అనువైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో సైన్స్, సాహిత్యం, కథలు, జీవిత గాథలు, విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించే అనేక గ్రంథాలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఇతర భాషలలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి వారం ప్రత్యేక కథా సమాహారాలు, పఠన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లైబ్రరీ ప్రతి రోజూ సాయంత్రం 5:00 సాయంత్రం నుంచి 7:00సాయంత్రం వరకు, ఆదివారం సెలవు రోజులలో 10:00 ఉదయం నుంచి సాయంత్రం 5:00 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. "తల్లిదండ్రులు తమ పిల్లలకు కథలు చదివించాలని వారిని గ్రంథాలయాలకు తీసుకెళ్లాలని విజ్ఞాన ప్రపంచంతో వారిని పరిచయం చేయాలని స్నేహితులతో కలిసి కూర్చొని చదివే అనుభూతి వారికి కొత్త లోకాన్ని పరిచయం చేస్తుంది" అని బాలోత్సవం సభ్యులు తెలిపారు. 23న ఉదయం 11 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లైబ్రరీ ప్రారంభోత్సవం జరగనుంది. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలలు, విద్యాసంస్థలు లైబ్రరీ ప్రారంభానికి హాజరై, పఠన సాంస్కృతిని ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్. సోమయ్య, ఉపాధ్యక్షురాలు కె. సుజావతి, నవీన్, బ్రహ్మణి, రజిత, జ్ఞానదీప్ పాల్గొన్నారు.

'గ్యాస్ ఏజెన్సీల శ్రమ దోపిడీకి గురవుతున్న కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికులు'

తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహా సభలు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40,500 మంది కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికులు ఉన్నారని, వీరందరూ గ్యాస్ ఏజెన్సీల శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, గౌరవ సలహాదారులు చామకూర రాజు ఆరోపించారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ కార్మికులకు కొన్ని ఏజెన్సీలు కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ, సివిల్ సప్లై అధికారులు గ్యాస్ ఏజెన్సీ యజమాన్యాలకు వత్తాసు పలుకుతూ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ ఏజెన్సీలపై ప్రభుత్వ అధికారులు వెంటనే విచారణ చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. 23న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహా సభలను నిర్వహిస్తున్నామని, కార్మికులు ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్య ఉపాధ్యక్షులు ఎండి.యూనస్, రమేష్, తిరుపతి, కుమార్, అజయ్ రెడ్డి, గోర శ్యాంసుందర్ తదితరులున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



నవతెలంగాణ-ముషీరాబాద్

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ అధ్యక్షులు డా.ఆర్. రమాదేవి అధ్య క్షతన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభు, సీతాఫల్ మండి డిగ్రీ కళాశాల తెలు గు విభాగాధిపతి డా.కె. సైదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు మాట్లా డుతూ... భాష యొక్క ప్రయోజనం భావ వినిమయంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించడమని, స్వాతంత్ర ఉద్యమ కాలంలో ఉద్యమ భావాలను, పోరాటాలను దేశీయమైన భాషల్లోకి తర్జుమా చేయడం ద్వారా దేశమంతా చైతన్యమై ఐక్యంగా నిలిచిందన్నారు. యునెస్కో ప్రకటించిన ప్రకారం ప్రపంచంలోని 6000 భాషలలో 3000 భాషలు నశించే దశలో ఉండడం బాధాకరమన్నారు. మాతృభాష మాతృమూర్తితో సమానమైనదని, ఇతర భాషలను గౌరవించినప్పుడే మానవీయ సమాజం రూపొందు తుందని, విద్యార్థులు మాతృ మూర్తిని గౌరవించడం మాతృభాష ను గౌరవించడం అలవర్చుకోవాల ని సూచించారు. ఈ కార్యక్రమం లో కళా శాల వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్ లావణ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ కె. నీరజ, అధ్యాపకులు డా. పెబ్బేటి మల్లికార్జున్, డా. విజయ, డా.కళ్యాణి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే సమస్యలు పరిష్కారం

- కార్పొరేటర్ విజయ రెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఓల్డ్ సి.ఐ.బి క్వార్టర్స్ నుంచి ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ వరకు జరుగుతున్న వర్షపు నీటి పైప్‌లైన్ పనులను జి.హెచ్.ఎం.సి. డి.ఇ చైతన్యతో పాటు బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులతో కలిసి శుక్రవారం కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి పర్యటించి అన్ని శాఖలు సంయుక్తంగా భాగస్వాములై పనిచేస్తేనే సమస్యలకు పరిష్కారానికి మార్గం సుగమం అవుతాయన్నారు.

అలెగ్జాండర్‌కు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇంగ్లీష్ విభాగంలో పాల శ్రీనివాస్ అలియాస్ అలెగ్జాండర్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ మురళీకష్ణ పర్యవేక్షణలో "యూజ్ ఆఫ్ డిజిటల్ రిసోర్సెస్ ఫర్ రీఎన్ఫోర్సింగ్ ది ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఆఫ్ లెర్నర్స్ ఎట్ ద టెర్షరీ లెవెల్" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి అలెగ్జాండర్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్టు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి దశలో టీఆర్ఎస్వి, ఎంఎస్ఎఫ్‌లలో క్రియాశీలకంగా పని చేసిన ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఆత్మగౌరవ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ప్రజలకు అసౌకర్యం లేకుండా
వ్యాపారాలను నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్...

ట్రాఫిక్‌కు, ప్రజలకు అసౌకర్యం కల్పించకుండా వ్యాపారాలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్ పాత్ వ్యాపారులకు సూచించారు. రాంగోపాల్ పేట డివిజన్‌లోని అంజలీ థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో పుట్ పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలను ట్రాఫిక్ పోలీసులు కొద్దిరోజుల క్రితం అక్కడినుంచి పంపించారు. దాంతో వారు ఎమ్మెల్యేను కలిసి తమ జీవనోపాధి లేకుండా చేస్తే తమ కుటుంబాలు వీధినపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులతో పలు మార్లు సమావేశమై పుట్ పాత్ వ్యాపారుల పట్ల మానవతా దక్పధంతో వ్యవహరించాలని, వారిని ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చొరవతో అంజలీ థియేటర్, చిత్ర దర్గా పరిసరాలలో పుట్ పాత్ వ్యాపారులు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు అధికారులు అనుమతించారు. దీంతో పుట్ పాత్ వ్యాపారులు శుక్రవారం బీఆర్ఎస్ రాంగోపాల్ పేట డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తమకు అండగా నిలిచినందుకు కతజ్ఞతలు తెలిపారు. పుట్ పాత్ వ్యాపారులు సతీష్, నర్సింగ్ రావు, శంకర్, చిన్న, రాణి, సన్నీ, అనిత తదితరులు ఉన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలని వినతి



నవతెలంగాణ-ఓయూ

రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకొని తార్నాక డివిజన్‌లోని పలు మసీదుల వద్ద తగిన ఏర్పాట్లు చేపట్టాలని తార్నాక డివిజన్ ముస్లిం మైనారిటీస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ స్పందిస్తూ, తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

పీహెచ్డీ కేటగిరీ 2లో మార్పులు చేయాలి



నవతెలంగాణ-ఓయూ

పీహెచ్డీ కేటగిరి-2 నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని కోరుతూ ఓయూ వీసీ ప్రొ. కుమార్‌ను శుక్రవారం ఓయూ విద్యార్థి సంఘాలు నేతలు కలిశారు. వీసీకి నోటిఫికేషన్‌లో మార్పులు ఆవశ్యకతను వివరించారు. ఓయూ పీహెచ్డీ కేటగిరి -2 నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని నేతలు గత కొన్ని రోజులుగా వివిధ రకాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా ఓయూ విద్యార్థి నేతలు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయోపరిమితిను 65 ఏండ్లకు పెంచిన నేపథ్యంలో 57 సంవత్సరాల నుండి 65 సంవత్సరాలు దాకా గైడ్ షిప్ ఇవ్వాలన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్‌కు గైడ్ షిప్ అవకాశం కల్పించాలని కోరారు. రీసెర్చ్ సెంటర్లకు, అర్హత కలిగిన డిగ్రీ లెక్చరర్స్‌కు గైడ్ షిప్ అవకాశం కల్పించి పేద,గ్రామీణ ప్రాంతాల మొదటి తరం విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా అప్పగించని ర్యాంకు సిస్టంను ఎత్తివేసి, ఎగ్జామ్‌లో క్వాలిఫై అయిన అందరి అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలవాలని అన్నారు. పి.ఎచ్.డి కేటగిరి-2 నోటిఫికేషన్ లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను, మంత్రులను, ప్రజా సంఘాల నేతలను కలిసి మరింత ఐక్య ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. జార్జి రెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్, విద్యార్థి నేతలు పూసల రమేష్, హరీష్, ఫ్లలపు చందు, బోరెల్లి సురేష్, అజయ్ స్వామాట్ ,శివ, వినోద్, కరణ్, రుక్మత్ పాషా,మనోజ్, బోనాల నగేష్, నరేందర్,మహేష్,మధు, మహేష్,పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యం

- టాఫా అధ్యక్షుడు చాగన్ల బల్వీందర్‌నాథ్



నవతెలంగాణ-బంజారా హిల్స్

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యమని తెలంగాణ అమెరికన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టాఫా) అధ్యక్షుడు చాగన్ల బల్వీందర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలో అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ టాఫా ఆధ్వర్యంలో అమెరికన్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ అకాడమీలు షురూ అయ్యాయి. శుక్రవారం బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బల్వీందర్ నాథ్,సుధాకర్ రావు నడిపల్లి, ఉపాధ్యక్షులు సీఈఓ ఏఎఫ్ఎఫ్ఐ, (ముంబై),సందీప్ చౌదరి, భారత జట్టు కెప్టెన్, జీవీ మనికంఠ రెడ్డిలతో పాటు సెక్రటరీ సుధాకర్ రెడ్డి, ట్రెజరర్ అరుణ్ తేజ్‌లు టాఫా టీ షర్ట్స్ ఆవిష్కరించారు.

అనంతరం వారు మాట్లాడారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో సంఘాల ఏర్పాటుతో పాటు గచ్చిబౌలిలో అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహిస్తామనీ ప్రకటించారు. 2025-28 మధ్య కాలానికి అధ్యక్షుడిగా చాగన్ల బల్వీందర్ నాథ్‌ను నియమించిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్‌లను ప్రోత్సహించి, అభివృద్ధి చేయాలన్న టాఫా లక్ష్యంలో ఇదో కీలకమైన ముందడుగా భావిస్తూ, క్షేత్రస్థాయి చర్యలపై దష్టిపెట్టి,ఇది యువతకు, ఔత్సాహిక అథ్లెట్లకు వేగంగా అభివద్ధి చెందుతున్న ఈ క్రీడలలో పాల్గొనే అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఇంకా పాఠశాలలు, కళాశాలలలో ఈ అసోసియేషన్ ఫ్లాగ్ ఫుట్ బాల్‌ను ప్రవేశపెడుతుందని, దీనివల్ల ఈ క్రీడకు ఆదరణతో పాటు క్షేత్రస్థాయి నుంచి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. త్వరలో గచ్చిబౌలిలో అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్ నిర్వహించాలన్న ఆలోచనలో ఉన్నామని వారు తెలిపారు.

తెలంగాణ సాహిత్య అకాడమీలో మాతృభాషా దినోత్సవ సదస్సు



నవతెలంగాణ - సిటీబ్యూరో

తెలుగులో చాలా మాండలికాలు ఉన్నాయని, కుటుంబంలో మాట్లాడే తెలుగుకు, తెలంగాణ పల్లెల్లోని ఇండ్లలో మాట్లాడే తెలుగుకు, పాఠశాలలో బోధించే ప్రామాణిక తెలుగు మాధ్యమానికి చాలా తేడా ఉందని ప్రముఖ కవి యాకూబ్ అన్నారు. మనిషి మాట్లాడే భాష ప్రతి మనిషికి సాంస్కృతిక హక్కు అని ఆయన చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి వివిధ రంగాలకు చెందిన పలువురు భాషా, సాహితీవేత్తలతో అకాడమీ కార్యదర్శి బాలాచారి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అనేకమంది సాహితీవేత్తలు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ భాషా బోధనలో తెలుగు విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అలాగే మన యాసలను కాపాడుకోవాలని చెప్పారు. అలాగే వక్తల వారి వారి అభిప్రాయాలు సూచనలను ఒక నివేదికగా ప్రభుత్వానికి సమర్పించాలని కార్యదర్శి బాలాచారి కి సూచన చేశారు. యునెస్కో నిర్ణయం ప్రకారం ప్రతిఏటా ఫిబ్రవరి 21వ తేదీ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. ఆచార్య టి. గౌరీ శంకర్ మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవం నేపథ్యాన్ని మాతృభాషల పరిస్థితిని, రోజురోజుకు దిగజారిపోతున్న తెలుగు స్థితిని వివరించారు. ప్రపంచంలో ఇప్పటికే అంతరించిపోయిన, ప్రస్తుతం కనుమరుగవుతున్న అనేక భాషల గురించి గణాంకాలతో సహా తెలియజేశారు. ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి మాట్లాడుతూ దేశంలో ఉన్న అనేక గిరిజన జాతుల ఆదివాసీ భాషలు అంతరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సాహితీవేత్త కాలువ మల్లయ్య మాట్లాడుతూ భాషలు బతకాలంటే బోధనే ప్రధానమని పేర్కొన్నారు. ప్రముఖ మానసిక శాస్త్రవేత్త డాక్టర్ వీరేందర్ మాట్లాడుతూ మాతృభాష వల్లనే మనిషిలో సహనుభూతి పెరుగుతుందని చెప్పారు. జూపాక సుభద్ర మాట్లాడుతూ వయసు, జెండర్, వృత్తుల పరంగా వివిధ ప్రాంతాల్లో భాష మారుతుందన్నారు. భాషావేత్త విమల మాట్లాడుతూ భాషను పరిరక్షించడం కాదు, భాష పట్ల అటెన్షన్ ఉండాలన్నారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ భాషాభివృద్ధికి ప్రభుత్వాలు పూనుకుని నిధులిచ్చి ప్రోత్సహించాలని చెప్పారు.ప్రొఫెసర్ బాణాల భుజంగారెడ్డి మాట్లాడుతూ భాష అనేక పదాలను కలుపుకుని అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందుకు ప్రభుత్వాలు పూనుకొని భాష పైన ప్రత్యేక నిఘంటువును రూపొందించాలని, అవసరమైన వ్యాకరణాలు రాయించాలని అన్నారు. సంస్కృత పండితుడు సంగనభట్ల నరసయ్య మాట్లాడుతూ తెలుగులో సంస్కృతం ప్రాముఖ్యతని కాదనలేమని చెప్పారు. మాతృభాష బతకాలంటే మరో ఉద్యమం రావాలి అన్నారు. నాలేశ్వరం శంకర్ మాట్లాడుతూ భాషా ఉద్యమాలు జరగవలసిన అవసరం ఉందన్నారు. భాషావేత్తలైన దొరవేటి చెన్నయ్య, యువకవి తిరునగరి శరత్ చంద్ర, చింతపట్ల సుదర్శన్, డా.సగిలి సుధారాణి చంద్రప్రకాశ్ రెడ్డి, కోదాటి అరుణ, ఆనందచారి, సీతాలక్ష్మి మరియు పలువురు భాషా, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- వచ్చేనెల 5 నుంచి 25వరకు పరీక్షల నిర్వహణ
- 244 పరీక్షా కేంద్రాలలో 179218 మంది విద్యార్థుల హాజరు
- అధికారులు నిబద్దతతో కలసి పనిచేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మీటింగ్ హాల్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షలకు 244 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామనీ, పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 85,753 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 93,465 మంది మొత్తంగా 1,79,218 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణకు హైదరాబాద్‌లో ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు ఉదయం 8గంటల వరకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అదేవిధంగా సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలని, ప్రశ్నాపత్రాల తరలింపులో పోలీసులు అత్యంత బాధ్యత, భద్రత తీసుకోవాలన్నారు.

విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, నిరంతరం పరీక్ష కేంద్రాలలో విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు శానిటేషన్ సౌకర్యాలతో పాటు వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రశ్నాపత్రాల కవరు సీల్ తీయటం, జవాబు పత్రాలను కవరులో ఉంచి సీల్ వేయడం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు నిర్దేశించిన సమయానికి అన్ని కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. చీఫ్ సూపర్‌టెండెంట్‌కి తప్ప మిగతా వారికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆదిశగా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్షల నిర్వహణ తేదీలలో ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు కేంద్రాల గుండా నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సంబంధిత అధికారిచే జారీ చేయబడిన ఐడీ కార్డులు ఉంటేనే తప్ప ఇతరులను అనుమతించరాదని సూచించారు. విద్యార్థులు ముందుగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా కేంద్రాల లొకేషన్‌లను ముందుగా పరిశీలించుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 040-29700934 ద్వారా నివృత్తి కోసం సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి. ఒడ్డెన్న, ఏసీపీ భాస్కర్, ఆర్.ఎం బాబూనాయక్, జిల్లా వైద్య అధికారి జె. వెంకటి, పోస్టల్ అధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను నియమించడంతో శుక్రవారం ఆయనకొమురం భీం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ శ్యామ్‌ను కలిసి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి ఓటర్‌ను కలసి కాంగ్రెస్ గెలుపు ఆవశ్యకతను వివరించి పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని జిల్లాలోని పట్టభద్రులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

బీఎస్ఐ కమిటీ సభ్యులుగా ఓయూ ప్రొ. డా.సయ్యదా అజిమ్ ఉన్నిసా



నవతెలంగాణ-ఓయూ

ఓయూ సైన్సు కాలేజ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సయ్యదా అజీమ్ ఉన్నిసాకు బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ వాటర్ క్వాలిటీ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. అజీమ్ ఉన్నిసా ఎంపిక పట్ల ఓయూ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. పర్యావరణ శాస్త్రం, నీటి నాణ్యత అంచనా, స్థిరత్వంలో ఆమె చేసిన విస్తత పరిశోధనలు, నైపుణ్యానికి దక్కిన గుర్తింపుగా పేర్కొన్నారు. ఆమె జాతీయ నీటి నాణ్యత ప్రమాణాలను రూపొందించడంలో, దేశం కోసం సురక్షితమైన, సమర్థవంతమైన, స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులను నిర్ధారిస్తుంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అనేది భారత జాతీయ ప్రమాణాల సంస్థ, భారతీయ ప్రమాణాలను అభివృద్ధి చేయడం, ప్రచురించడం, కన్ఫర్మిటీ అసెస్‌మెంట్ స్కీమ్‌లను అమలు చేయడం, నాణ్యతా మూల్యాంకనం కోసం గుర్తింపు, ప్రయోగశాలలను నిర్వహించడం, హాల్‌మార్కింగ్‌ను పర్యవేక్షించడం, వినియోగదారుల సాధికారతను పెంచడం, సామర్థ్య-నిర్మాణ కార్యక్రమాల నిర్వహణ బీఐఎస్ బాధ్యత. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్, ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ వంటి గ్లోబల్ స్టాండర్డైజేషన్ సంస్థలలో కూడా బీఐఎస్ భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆమె గతంలో పలు ప్రతిష్టాత్మక అవార్డ్‌కు ఎంపికయ్యారు.పలు పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. ఆమెకు పలువురు ప్రొఫెసర్స్ ,విద్యార్థులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాయింట్ కమిషనర్ వివాహేతర సంబంధం..!

- పక్కా ప్లాన్‌తో పట్టుకున్న భార్య
- భర్తకు దేహశుద్ధి చేసిన బంధువులు




జానకి రామ్

నవతెలంగాణ-ఓయూ

గౌరవ ప్రదమైన హోదా విస్మరించి వయస్సును మించి భార్య ఉండగా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ జానకి రామ్ అడ్డంగా బుక్కయ్యాడు. అతడి భార్య కొన్ని రోజులు గా పక్కా ప్లాన్ వేసి మరి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ ఘటన వారాసిగూడ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. జీహెచ్ఎంసీలో అడ్మిన్ విభాగంలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న జానకిరామ్ కొంతకాలంగా విధి నిర్వహణ అని చెబుతూ సరిగ్గా ఇంటికి రావడం లేదు. అలాగే ఫోన్లు సైతం ఎక్కువగా మాట్లాడుతుండడంతో భార్యకు అనుమానం వచ్చింది. దాంతో భర్త పై నిఘా పెట్టిన ఆమె.. వారసిగూడలో ఒక అపార్ట్‌మెంట్ తనకన్నా 20 ఏండ్ల వయసు తక్కువగా ఉన్న ఓ మహిళతో అతను కలిసి ఉన్నట్టు గుర్తించింది. శుక్రవారం ఉదయం ఆ అపార్ట్మెంట్‌కు బంధువులతో కలిసి వెళ్లిన ఆమె.. ఆ ఇద్దరినీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. అనంతరం జానకిరామ్‌ను అతని భార్య బంధువులు చితకబాదారు. విషయం తెలుసు కున్న పోలీసులు అక్కడికి చేరుకొని జానకిరామ్‌తోపాటు అతనితో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ. జానకిరామ్ ఎక్కడ పనిచేసిన అక్కడ ఆఫీసు లోని అమ్మాయిలతో వివాహేతర సంబంధాలు పెట్టుకుంటారని ఆరోపించారు. గతంలో పలు మార్లు తాను వారిని పట్టుకున్నట్టు చెప్పారు. అయినా పరిస్థితి లో మార్పు రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్



నవతెలంగాణ-ఓయూ

లాంగ్వేజ్ అండ్ డిజిటల్ ఏజ్ :హౌ టెక్నాలజీ సేఫ్ కమ్యూనికేషన్ అనే అంశంపై ఒక రోజు ప్రత్యేక వర్క్‌షాప్ ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సెషన్‌ను ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంగు ప్రారంభించారు. భాషా అభ్యాసం అండ్ కమ్యూనికేషన్‌లో డిజిటల్ మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఇంగ్లిష్ విభాగ అధిపతి ప్రొ. సవిన్ సౌడ ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ఆయన ఆధ్వర్యంలో విజయవంతమైన నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థులతో వర్క్‌షాప్ లక్ష్యాలను పంచుకుని ఈ అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడంలో దీని ప్రాముఖ్యతను ఆయన వెల్లడించారు.ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన డా. స్ఫూర్తి , శ్రీనిధి యూనివర్సిటీకి చెందిన డా. నరేందర్ గున్‌రెడ్డి ముఖ్యమైన ఉపన్యాసాలు అందించారు. భాషా అభ్యాసం, కమ్యూనికేషన్, నేర్చుకునే విధానాలపై డిజిటల్ సాధనాలు, కత్రిమ మేధస్సు కలిగించే విప్లవాత్మక మార్పులను వారు వివరించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ సర్టిఫికెట్లను పంపిణీ చేసి పాల్గొన్న వారందరిని అభినందించారు. భాషా అభ్యాసంలో డిజిటల్ ఆవిష్కరణలను స్వీకరించేందుకు విద్యార్థులను ప్రోత్సహించారు.

ప్రజా కళాకారుడు షేక్ నాజర్



నవతెలంగాణ- కల్చరల్

తన గంభీర గళంతో వేలాది శ్రోతలను ముగ్దులను చేసి వారిని చైతన్య పరచిన అద్భుత బుర్ర కథ కళాకారుడు శేక్ నాజర్ ప్రజా కళాకారుడని హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపర లో భాగంగా నాజర్ యాది లో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్న మాట్లాడారు. గుంటూరు జిల్లా లో కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన నాజర్ కు మంచి స్వరం వరంగా వచ్చిందన్నారు. ఆయన తొలి రోజుల్లో భిక్షాటన కూలీ పనులకు వెళ్లి సంగీతం లో శిక్షణ పొందారని చెప్పారు. సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ హేతు వాది అయిన నాజర్‌కు కమ్యూనిస్టు పార్టీ ప్రజా నాట్య మండలి వేదికలు కల్పించి ఆయన బుర్ర కథలకు ప్రాచుర్యం కల్పించారని వివరించారు. కొన్ని సినిమాలలో నటించి బుర్ర కథ చెప్పినా అక్కడి వాతావరణం నచ్చక తిరిగి తన రంగస్థల కళను నమ్ముకున్నారని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నాజర్ కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ తో సత్కరించి ఆయన పట్ల తమ గౌరవం ప్రకటించారని తెలిపారు. వెంకట రావు, వేంపటి శ్రీనివాస్ పాల్గొన్నారు



కాంగ్రెస్ రహమత్ నగర్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శిగా ఫర్హీన్ బేగం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కాంగ్రెస్ రహమత్ నగర్ డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన ఫర్హీన్ బేగంను బండపల్లి భవాని శంకర్ శాలువాతో సత్కరించి అభినందించారు. డివిజన్‌లోని మహిళలకు అందుబాటులో ఉండి, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని, వారికి అండగా ఉండాలని భవాని శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్‌కమిటీ ప్రధాన కార్యదర్శి గ్యారా నాగరాజు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మేఘన పద్మ, సువర్ణమ్మ అరుణ్ గౌడ్, దేవేందర్, బెన్వర్, పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసీ మద్దతు



నవతెలంగాణ-ఓయూ

మెదక్, నిజామాబాద్ , అదిలాబాద్, కరీంనగర్ , పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓయూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన బిడ్డ ప్రసన్న హరికృష్ణను భారీ మెజారిటీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓయూ జేఏసీ రాష్ట్ర నాయకులు కోడూరు రఘు కోరారు.శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రెండు జాతీయ పార్టీలు ఒకే అగ్రవర్ణ ఆధిపత్య కులానికి టికెట్లు కేటాయించి, 90 శాతం జనాభా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలను విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు జాతీయ పార్టీలు మద్దతిచ్చిన అభ్యర్థులు కార్పొరేట్ వ్యాపారాలతో, ప్రయివేటు విద్యాసంస్థలను, ఏర్పాటు చేసి పేద వర్గాలను ముక్కు పిండి ఫీజులు వసూలు చేసిన వేల కోట్లు సంపాదించి రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఉన్నతంగా బలంగా ఉన్నారన్నారు. కానీ ప్రసన్న హరికృష్ణ,ఒక పేదింటి బహుజన బిడ్డ కేవలం చదువుకొని జ్ఞానంతో వందలాది పుస్తకాలు రాసి వేలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించేలా చేశాడన్నారు. సీరియల్ నంబర్ మూడులో గల ప్రసన్న హరికష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు(1) వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు ఏల్చల వంశీకృష్ణ, అవినాష్ ,శ్రవణ్,సాయి,చరణ్, పాల్గొన్నారు.

24న చలో ఓయూ



నవతెలంగాణ-ఓయూ

అశాస్త్రీయంగా పెంచిన పరీక్ష ఫీజులను నిరసిస్తూ ఈ నెల 24న ఏబీవీపీ ఆధ్వర్యంలో చలో ఓయూకు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ హైదరాబాద్ సిటీ సెక్రెటరీ పత్వితేజ వుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూ పరిధిలోని పరీక్ష ఫీజులను విచ్చలవిడిగా పెంచి పేద, మధ్యతరగతి విద్యార్థుల దగ్గర ముక్కిపిండి వసూలు చేయడాన్ని ఖండిస్తున్న ట్టు తెలిపారు. ప్రయివేటు యూనివర్సిటీలను తలదన్నేలాగా ప్రభుత్వ యూనివర్సిటీలో పరీక్ష ఫీజులు ఇలా ఉండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో లేనంతగా పరీక్ష ఫీజులు వందేండ్ల చరిత్ర గల ఓయూ లో ఉండటం విడ్డూరకరం అని అన్నారు.యూనివర్సిటీ వైఖరి వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారి పక్షాన ఏబీవీపీ పోరాడుతుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

జలమండలి ఎండీని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన డ్రయినేజీ వ్యవస్థ, వాటర్ వర్క్ పనుల కోసం నిధుల మంజూరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, భైరీ నవీన్ గౌడ్, నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి రూ. 6 కోట్లు మంజూరు

మేయర్‌కు గద్వాల విజయలక్ష్మికి అభినందనలు తెలిపిన కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌కు అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కార్పొరేటర్ బన్నాల గీత కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నగర మేయర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బన్నాల మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో చిల్కానగర్ చౌరస్తా వివేకానంద విగ్రహం నుండి కావేరి నగర్ కల్వర్టు వరకు స్ట్రాం వాటర్ డ్రెన్ పైప్ లైన్ అభివృద్ధి చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గతంలో వైకుంఠధామం అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. చిల్కానగర్ డివిజన్ ప్రజల తరఫున మేయర్ విజయలక్ష్మికి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



నవతెలంగాణ-కీసర

మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి రావాలని కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, దేవాలయ చైర్మెన్ తటాకం నారాయణ శర్మ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. సీఎం కలిసిన వారిలో కీసరగుట్ట ఈవో సుధాకర్ రెడ్డి, కీసర మండల నాయకులు కందాడి అంజి రెడ్డి, ఫౌండర్ ట్రస్టు సభ్యులు తటాకం రమేష్ శర్మ, తటాకం ఉమాపతి శర్మ, తటాకం వెంకటేష్ శర్మ, దేవాలయ ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు జూపల్లి సాయిలు, మొరుగు ముత్యాలు, నల్ల మధుసూదన్ రెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్ ముదిరాజ్ , కందాడి రాజిరెడ్డి, శ్యామల అమరేందర్, దుండిగళ్ళ దుర్గా ప్రసాద్‌గౌడ్, నల్లోల కుమార్, సగ్గు అనిత, రాపోలు శంకరయ్య, ప్రభాకర్ గౌడ్, కృష్ణా రెడ్డి, కీసర మాజీ ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ, యువ నాయకులు భానుశర్మ, పాల్గొన్నారు.

ప్రపంచం సోషలిజం వైపు చూస్తుంది



- మానవాళి విముక్తికి మార్గం సోషలిజమే
- సీపీఐ(ఎం) నాయకులు చింతల యాదయ్య, ఘట్కేసర్ మండల కార్యదర్శి ఎన్.సబిత

నవతెలంగాణ-ఘట్కేసర్

భారత్ ఇరుగు పొరుగు దేశాల్లో ఎర్రజెండా అప్రతిహతంగా ముందుకు సాగుతుందని, ప్రపంచం చూపు సోషలిజం వైపు పయనిస్తుందని సీపీఐ(ఎం) నాయకులు చింతల యాదయ్య మండల కార్యదర్శి ఎన్.సబిత అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ సీఐటీయూ ఆఫీసులో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'రెడ్ బుక్స్ డే'ను వామపక్షాలు ఫిబ్రవరి 21న 'రెడ్ బుక్స్ డే'ను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. 1848 ఫిబ్రవరి 21న మొదటిసారి కమ్యూనిస్టు ప్రణాళిక విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని 2020 నుంచి రెడ్ బుక్స్‌డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023 నుండి సీపీఐ(ఎం) శ్రేణులు ఇందులో ప్రత్యక్షంగా పాల్గొంటూ అధ్యయనం చేస్తున్నాయన్నారు. సోవియట్ యూనియన్ కూలిపోయాక కమ్యూనిజం పాతాళానికి తొక్కబడిందని, అది ఇక తిరిగి లేవదని అమెరికా గర్వంగా ప్రకటించిందని, పడిలేచిన కెరటంలాగా లాటిన్ అమెరికా దేశాల్లో ఎర్రజెండా రేపరేపలాడుతుందన్నారు. ఎర్రజెండాకు ఎదురుదెబ్బలు తప్ప ఎగరడం, ఆగడం లేదన్నారు. 176 ఏండ్ల క్రితం కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా మార్క్స్, ఎంగెల్స్‌లు అదే చెప్పారని తెలిపారు. దేశంలో దేవుళ్లను, గుడులను, భక్తిని వ్యాపారంగా మార్చి వాడుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. 'ప్రపంచాన్ని కమ్యూనిజమనే భూతం ఆవహించిందని 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో పెట్టుబడిదారులను ఉద్దేశించి మార్క్స్, ఎంగెల్స్ చెప్పారని వారు అన్నారు. 2014లో మోడీ చేసిన వాగ్దానాలు పూర్తిగా భంగమయ్యాయన్నారు. అధికారాన్ని, కార్పొరేట్ లాభాలను, ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నారని అన్నారు. దీన్ని ప్రశ్నించిన భక్తులు, పురోహితులపై సైతం దాడులకు దిగుతున్నారని చెప్పారు. వారికి హిందూమతం మీదకన్నా హిందూత్వ పేరుతో మతోన్మాద రాజకీయాలు చేయడంపైనే ఆసక్తి ఎక్కువగా ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిపై 'రామరాజ్యం' పేరుతో జరిపిన భౌతిక దాడి ఈ కోవకు చెందినదే అన్నారు. శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం మానవ అభ్యున్నతికి బాటలు వేస్తున్నదని చెప్పారు. సామాజిక రంగంలో శాస్త్రమే కమ్యూనిజం, దాని లక్ష్యం సోషలిజం సాధన అని, దాన్ని సాధించే దిశలో ఆయుధమే మార్క్సిస్టు సాహిత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కె.చంద్ర మోహన్, కడమంచి యాదగిరి, వరికుప్పల రాములు, శివారెడ్డి, వరికుప్పల వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బండారి లక్ష్మారెడ్డిని కలిసిన సోనియా గాంధీ నగర్ ఫేజ్-3 కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని సోనియాగాంధీ నగర్ ఫేజ్-3 నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తమ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, నూతన అధ్యక్షులు నల్లోల కనకయ్య, కార్యదర్శి మాదాసు చంద్రం, కోశాధికారి చరక వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆకుల సంతోష్, సంయుక్త కార్యదర్శి వి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం : ఎస్ఈ



నవతెలంగాణ-ఉప్పల్

వేసవికాలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా, నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తామని హబ్సిగూడ ఎస్ఈ బ్రహ్మం అన్నారు. గురువారం రాత్రి ఇండస్ట్రియల్ ఐడియాలో ఫెరో కాస్ట్ నూతన ఫీడర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫెరో కాస్ట్ ఫీడర్ ఓవర్ లోడ్‌తో విద్యుత్ సమస్యలు తలెత్తేవని, విద్యుత్ సమస్యలు లేకుండా నూతన ఫీడర్‌ను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ సుబ్బారావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఘనంగా 'రెడ్ బుక్' డే



నవతెలంగాణ-కాప్రా

ప్రతి ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులు, వామపక్షవాదులు, ప్రగతిశీలవాదులు, మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలను శాస్త్రీయ సోషలిస్టు విధానాల ప్రచారంలో భాగంగా సామూహిక పఠనం కార్యక్రమం జరుపుతున్నారు. అందులో భాగంగానే శుక్రవారం సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీస్‌లో 'రెడ్ బుక్ డే' సామూహిక పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాప్రా సర్కిల్ కమిటీ కార్యదర్శి జి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ప్రపంచంలో 1917లో రష్యాలో కార్మికవర్గ విప్లవం జయప్రదమైన నాటి నుండి సోషలిస్టు సోవియట్ యూనియన్‌లోను తరువాత మెక్సికో, జపాన్, చైనా, తూర్పు యూరప్ దేశాలు, పశ్చిమ ఐరోపా దేశాలలో, భారతదేశంలో కూడా రెడ్ బుక్ డే కార్యక్రమం విస్తృతంగా జరుపుతున్నారు. వామపక్ష సాహిత్యాన్ని ప్రచురించటం ప్రజల్లోకి ఆ పుస్తకాలని అమ్మటం, గ్రంథాలయాల ద్వారా వివిధ వేదికల ద్వారా అధ్యయనాన్ని ప్రోత్సహిస్తారు. ఈ రెడ్ బుక్ డే సందర్భంగా 'సాంస్కృతిక రంగంలో పార్టీ కర్తవ్యాలు' అనే బుక్‌ను సామూహికంగా అందరూ శుక్రవారం చదివారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జే. చంద్రశేఖర్, జి శ్రీనివాసులు, ఏ. అశోక్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాస్, నాయకులు నగర మాజీ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, నాయకులు జి. యాదగిరిరావు , సిహెచ్ ప్రసాద్, పి .గణేష్, బీవీ సత్యనారాయణ, కేవీ చారి, జెన్ని, దేవీరెడ్డి, పీబీచారి, శ్రీమన్నారాయణ, జయరాజు, ఎం. శ్రీనివాస్, ఉన్నికృష్ణ, శోభ, శివ నారాయణ, గిరీష్, సోమయ్య చారి, ప్రభాకర్, గౌషియా, సఫియా, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై ఎమ్మెల్యే మర్రి సమీక్షా సమావేశం



- అధికారుల తీరుపై అసహనం
- తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక

నవతెలంగాణ-ఆల్వాల్

మల్కాజిగిరి నియోజకవర్గంలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మంచినీటి సరఫరాలో జాప్యం జరగకుండా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి సమస్యలపై అధికారులను అప్రమత్తం చేశారు. వేసవి సమీపించేలోపు నీటి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

కౌకుర్ డివిజన్‌లో నీటి అక్రమ వ్యాపారంపై ఆగ్రహం

కౌకూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో 20 ఏండ్లుగా మంచినీటి కనెక్షన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ, నీటి అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ మల్లికార్జున్‌ను ఎమ్మెల్యే మందలించారు. ప్రజల కోసం కాకుండా రాజకీయ నాయకుల కోసం పనిచేస్తే చర్యలు తీసుకుంటామని జీఎం సునీల్ సమక్షంలో హెచ్చరించారు.

నేరేడుమెట్ డివిజన్‌లో నీరు వృథా..

నేరేడుమెట్ డివిజన్‌లోని సీబీఎస్ కాలనీలో ఏడు ఏండ్లుగా పైప్‌లైన్ లీకేజీ ద్వారా మంచినీరు వృథా అవుతుందనీ, దీనిపై స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.

జనప్రియా ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో నీటి సమస్య..

కౌకూర్ ప్రాంతంలోని జనప్రియా ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో 600 కుటుంబాల నుండి రూ.1.85 కోట్లు డిపాజిట్‌గా వసూలు చేసి, కేవలం నాలుగు నెలలు నీటి సరఫరా చేసి, సాంకేతిక కారణాలు చూపుతూ సరఫరాను నిలిపివేసిన అధికారులపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. వేసవి సమీపించేలోపు నీటి సరఫరాను పునరుద్ధరించాలని జీ.ఎం.సునీల్‌ను కోరారు.

మచ్చ బొల్లారం డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి ఆదేశం..

మచ్చ బొల్లారం డివిజన్‌లోని ఏడు జీ.ఏ.సీ కాలనీల సమస్యను వెంటనే పరిష్కరించాలని, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2కు కొత్త లైన్లు వేయించి మంచినీటి కనెక్షన్లు ఇవ్వాలని, లక్ష్మమ్మ ఎంక్లెవ్ నీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం. సునీల్, డీ.జీ.ఎంలు సాంబయ్య, ఆశ్రిత రాజు, మేనేజర్లు నవీన్, మల్లిఖార్జున్, తేజస్విని, సృజయి, కార్పొరేటర్లు విజయ శాంతి రెడ్డి, సునీత యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు ఢిల్లీ పరమేశ్, రాము యాదవ్, ఉస్మాన్, లక్ష్మణ్ యాదవ్, యాదగిరి గౌడ్, ప్రశాంత్ రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కాప్రా ప్రెస్ క్లబ్ కృషి





- అధ్యక్షులు పటేల్ నరసింహ యాదవ్, కార్యదర్శి దొమ్మాటి కిరణకుమార్ రావు
- కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - చర్లపల్లి

జర్నలిస్టుల సంక్షేమం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ కృషి చేస్తుందని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పటేల్ నరసింహ అన్నారు. సీనియర్ జర్నలిస్టులు బెలిదె అశోక్, గుమ్మడి హరిప్రసాద్‌ల అధ్యక్షతన శుక్రవారం కాప్రా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పడిన కాప్రా ప్రెస్ క్లబ్‌ను కొందరు తమ వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాలకి వినియోగించుకుంటున్నారని పలువురు జర్నలిస్టులు విమర్శించారు. ఈ సమావేశంలో కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులై పనిచేస్తున్న జర్నలిస్టులకు ఐదు లక్షల రూపాయలు, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ తీసుకు రావాలని నిర్ణయించారు. కాప్రా ప్రెస్ క్లబ్‌కు మూడు లక్షల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. కాప్రా పరిధిలోని జర్నలిస్టుల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు జర్నలిస్టులు నూతన కమిటీకి సూచించారు. కాప్రా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు పటేల్ నరసింహ యాదవ్ (నవతెలంగాణ), ఉపాధ్యక్షులు జి.రోజారాణి, వెంకటాపురం రవి, దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్ రావు (దిశ న్యూస్), సహాయ కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, జి.కె. ఆంజనేయులు, కోశాధికారి యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా గంగిపెన్న, వి.రామచంద్ర మూర్తి, ఎస్.నరేష్ నాయి, సలహాదారులుగా బెలిదే అశోక్, ఎం.పలనీ వర్ధారెడ్డి, గుమ్మడి హరిప్రసాద్, ముత్యం ముఖేష్ గౌడ్, జి.శ్రీనివాసరావు కమిటీని ఏకగ్రీవ సర్వసభ్య సమావేశం ఎన్నుకున్నది. త్వరలోనే ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం ఎమ్మెల్యే, కార్పొరేటర్, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల సమక్షంలో నిర్వహించుకుంటామన్నారు.

యువత సామాజిక అంశాలను అధ్యయనం చేయాలి



నవతెలంగాణ-కాప్రా

నేటి యువత సామాజిక అంశాలను అధ్యయనం చేయాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భారతదేశ మాజీ రాయబారి సురేష్ బాబు తెలిపారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కె.ఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను యూపీఎస్సీ పరీక్షలలో అర్హత సాధించి అనేక మెళకువలు సాధించానని, తద్వారా అనేక దేశాల దౌత్య పరమైన పరిస్థితులను పరిశీలించానని అన్నారు. అదే బాటలో నేడు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు సామాజిక అంశాలను నిశితంగా అధ్యయనం చేయాలని, దేశానికి అవసరమయ్యే పఠనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం ముఖ్యం కాదని, ఆ ఉద్యోగాలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలన్నారు. వ్యక్తిగత కాంక్షను పక్కనబెట్టి దేశమే ముఖ్యం అనే నానుడితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్. బోస్, కె. ఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సభ్యులు శంకర్ రావు, నారా నర్సింహా ...పోటీ పరీక్షల అభ్యర్థులు సాయి, రాజు, విజయ్, అక్షయ్, సుదర్శన్, నవీన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

టారో పంప్స్ టెక్స్మో ఇండస్ట్రీస్ సదస్సుకు విశేష స్పందన



నవతెలంగాణ-మేడ్చల్

పంట పొలాలలో వాడే బోరు మెషిన్లకు నాణ్యమైన సేవలు అందించే విధంగా అవగాహన సదస్సును శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని యాదాద్రి పంప్స్, బోర్ వెల్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో 150 మంది బోర్వెల్ టెక్నీషియన్లకు సర్వీసుల విషయంలో పూర్తి అవగాహన సదస్సును టారో పంప్స్ టెక్సమో ఇండస్ట్రీస్ వారు చేపట్టారు. హైదరాబాద్ మేనేజర్ చంద్రప్రకాష్ సదస్సులో పాల్గొని టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన సర్వీసులు అందించడంతోపాటు వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసం సైతం త్వరితగతిన స్పందించాలని తెలిపారు. యాదాద్రి బోర్ వెల్స్ ప్రొపోరైటర్ రాజు సదస్సులో పాల్గొన్న టెక్నీషియన్లకు హెల్మెట్లను బహుమతులుగా అందజేశారు. టెక్నీషియన్లు ఎల్లప్పుడూ రోడ్డుపై తిరుగుతూ ఉంటారని వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని హెల్మెట్లను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ చంద్రప్రకాష్, సీనియర్ సేల్స్ ఆఫీసర్ పి.మహేష్, సర్వీస్ మేనేజర్ రాజేష్, ఏరియా సేల్స్ ఆఫీసర్ ఎల్.రవి తదితరులు పాల్గొన్నారు.



భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



- జలమండలి ఎండీకి ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ఆర్ వినతి

నవతెలంగాణ - చర్లపల్లి

భూగర్భ డ్రయినేజీ పనుల కు నిధులు మంజూరు చేయా లని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు జలమండలం ఎండీ అశోక్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ, వాటర్ లైన్ అభివృద్ధి పనులకునిధుల మంజూరు చేయాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన



నవతెలంగాణ -శామీర్‌పేట

శామీర్ పేట తహశీల్దార్ కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ యాదిగిరి రెడ్డి రికార్డుల వివరాలను అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ రికార్డు రూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈడీఎం శ్రవణ్ణి, డిప్యూటీ తహశీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకోవాలి



- మాజీ కౌన్సిలర్ కొడే మహేష్

నవతెలంగాణ - మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని పేర్లు నమోదు చేసుకోవాలని మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కుల గణన సర్వేలో పాల్గొనని వారి కోసం రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కులాల వారీగా ఎక్కడా లెక్కలు బయటకి ఇవ్వలేదని, బయట వస్తున్న కులాల వారి లెక్కలు పూర్తిగా తప్పు అని కావాలని ప్రతిపక్షాలు కాకి లెక్కలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇస్తూ ఈనెల 19 నుండి 28 వరకు అవకాశం ఇవ్వడం పట్ల బీసీ సంఘాల నేతలు, మేధావులు ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా ఉపాధి అవకాశాల్లో చట్టబద్ధత కల్పిస్తామని నిర్ణయం తీసుకోవడం పట్ల బీసీ సంఘాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపామని గుర్తుచేశారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24న నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా బ్రహ్మోత్సవాలకు రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కీసరగుట్ట రామలింగేశ్వర చైర్మెన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్ రెడ్డి, తటాకం వెంకటేష్, ఉమాపతి, రమేష్ ,ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు ఆహ్వానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ - అల్వాల్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న మరమ్మతు పనుల్లో భాగంగా 33/11 కేవీ కౌకుర్ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ నిసా ఫీడర్‌లో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని యాప్రాల్ ఏఈ లక్ష్మి భాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయం కారణంగా నిసా/ సీఐఎస్ఎఫ్ క్యాంపస్, హకీంపేట్ టీజీఎస్ఆర్టీసీ బస్ డిపో అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సింగాయిపల్లి గ్రామం, హకీంపేట్, సైనిక్, ఇందిరామ్మ కాలనీ, ఎలిఫెంట్ రెస్టారెంట్, హకీంపేట్ ఫేజ్-1 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీడిమెట్ల పీఎస్‌లో ప్లే జోన్ ప్రారంభం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పీఎస్‌లో ప్రయివేటు స్కూల్ ఆధ్వర్యంలో.. ఏర్పాటుచేసిన పిల్లల ప్లే జోన్ (ఫీడింగ్ రూమ్)ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. పీఎస్‌కి వచ్చే తల్లులకు, భార్యాభర్తల తగాదాలలో పీఎస్‌కి వచ్చే పిల్లలతో పాటు పీఎస్ సిబ్బంది పిల్లలకు, ఈ ప్లే జోన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చే రోజులలో ఇలాంటి జోన్‌లను మరిన్ని పీఎస్‌లలో విస్తరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలనగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ హనుమంతు, సీఐ గడ్డం మల్లేష్‌తో పాటు జీడిమట్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నుల చెల్లింపులు పరిశీలన



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దుండిగల్ మున్సిపాలిటీ అన్ని వార్డులలోని అస్తిపన్నుల చెల్లింపులను, బిల్ కలెక్టర్ల పనితీరును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ పరిశీలించారు. అదేవిధంగా మొండి బకాయిలు ఉన్న వారిని విచారించి.. ఆస్తిపన్ను కట్టవలసిందిగా సూచించారు. అదేవిధంగా అన్ అసెమెంట్, అండర్ అసెమెంట్, లేకుండా చూడాలన్నారు. షాపులు, హెూటల్స్ రెస్టారెంట్లు, బిజినెస్ చేసేవారు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్స్, బిల్ కలెక్టర్లు జవాన్లు పాల్గొన్నారు.

అద్భుత వంటకాలు అదరహెూ..



- ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు
- శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్ట్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థుల మనోభావాలకనుగుణంగా తల్లిదండ్రులు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అప్పుడే వారు అద్భుతాలు సృష్టిస్తారని ట్రస్మా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీ సాయి విద్యానికేతన్ చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూంనగర్ భగత్ సింగ్ మార్గ్ గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్ట్(2025) వేడుకలకు ఆయనతో పాటు కుత్బుల్లాపూర్ ట్రపసా ప్రధాన కార్యదర్శి దయాకర్, వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ చెప్యాల నర్సింలు గౌడ్, పాఠశాల డైరెక్టర్ బిర్రు శోభారాణిలతో కలిసి ప్రారంభించారు. ముందుగా ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు చేసిన ఉత్తర, దక్షిణాది వంటకాలతో పాటు పలు రకాల తెలుగు సాంప్రదాయేతర వంటకాలను తిలకించి రుచిచూసి అద్భుత వంటకాలతో అదరహెూ.. అనిపించారని విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చుని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే బోధిస్తున్నామన్నారు. విద్యతోపాటు, క్రీడలు సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు. ఫుడ్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నారులు చేసిన వంటకాలను చూసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా, ప్రశాంతి, కృష్ణవేణి, మహేశ్వరి, సాజిత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నేర నియంత్రణలో సీసీ టీవీలు కీలక పాత్ర



నవతెలంగాణ-బాలానగర్

నేర నియంత్రణలో సీసీ టీవీలు కీలక పాత్ర పోషిస్తాయని సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ సీఐ నర్సింహా రాజు నేతృత్వంలో ఇటీవల సీసీ టీవీల ప్రాముఖ్యత అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా బాలానగర్ డివిజన్ పరధిలోని ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా 32 సీసీ కెమెరాలను శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, బాలానగర్ ఏసీపీ హనుమంతా రావుతో కలసి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మొహంతి మాట్లాడుతూ శాంతి సామరస్యం ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసు శాఖ తీసుకుంటున్న వివిధ రకాల చర్యలపై బాలానగర్ పోలీసులు అవగాహన కల్పించామన్నారు. అన్నివర్గాల ప్రజలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను, బాలానగర్ సీఐ నర్సింహా రాజును ఈ సందర్భంగా సీపీ అభినందించారు. అంతే కాక సమాజ భద్రతలో భాగంగా ప్రతి కాలనీలో సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇందు కొరకు కావలసిని సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు, డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, సరళ, హాజీ మియా, ఆదర్శ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, రవికుమార్ తదితరులున్నారు.

రేపు భట్రాజు యువజన సంఘం వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర భట్రాజు యువజన సంఘం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని ఇంజాపూర్‌లో గల రాష్ట్ర సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కూరపాటి నరసింహారాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యువకులకు బహుమతుల ప్రధాన ఉత్సవంతో పాటు, పేద విద్యార్థులకు, కుటుంబాలకు ఆర్థిక చేయూత, బీసీ.రుణాలు, కేంద్ర పథకాలపై అవగాహన, విదేశీ విద్య ఉపాధిపై అవగాహన, ఆరోగ్య భీమాపై అవగాహన, విద్యా ఉపాధి జాబ్ మేళా, వివాహ పరిచయ వేదిక, యువజన కార్పస్ నిధులు, పలు క్రీడల అనంతరం వనభోజన కార్యక్ర మాలు నిర్వహిసున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ వార్షికోత్సవ వేడుకల్లో కుల సంఘ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని విజయవంతం చేయాల ని ఆయన విజ్ఞప్తి చేశారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో
జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో



నవతెలంగాణ-సిటీబ్యూరో

గుండ్లపోచంపల్లి పరిధిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో "ఇగ్నైట్ 2025" పేరిట జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ ఐ.టి విభాగాధిపతి డా. వనమాల ఉమారాణి, గౌరవ అతిథిగా సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.సివి నర్సింహులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా జంత్రీ లాబ్స్ డైరెక్టర్, శ్రీ పి నరేంద్ర వర్మ, సీబీఐటీ ఏఐ, డిఎస్ ప్రొఫెసర్ డా.ఆర్.మదన మోహన్, ఐఏఆర్ఈ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డా. పి. గోవర్దన్, ఎన్రిచ్ హెచ్‌సీఎం సొల్యూషన్స్ హెచ్ ఆర్ కన్సల్టెంట్ విభ కళ్యాణి, గోకరాజు రంగరాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ పి గోపాల్ కృష్ణ, పేటెంట్ ఐపిఆర్ సొల్యూషన్స్ డైరెక్టర్, శాస్త్రవేత్త డా. ఎం శంకర్ రావు, ఎంఎల్‌ఆర్ఐటి ప్రొఫెసర్ డా. త్రిమూర్తులు హాజరయ్యారు. ఉమారాణి మాట్లాడుతూ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోగల సత్తా నేటి యువతకు ఉండాలని, అందుకు తగ్గ ఆవిష్కరణలు ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. అందుకు ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. డా. సి.వి.నర్సింహులు మాట్లాడుతూ నేటి సమాజం ఎదుర్కొంటున్న నిజ జీవిత సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా సజనాత్మక పరిష్కారాలు ఉండాలని అందుకు తగ్గ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇటువంటి ప్రాజెక్ట్ ఎక్స్‌పోల వల్ల జ్ఞాన సముపార్జనే కాకుండా, నాయకత్వ లక్షణాలు కూడా మెరుగుపర్చుకోవడానికి ఇదొక సదవకాశం అని తెలిపారు. తదనంతరం కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని తద్వారా నూతన ఆవిష్కరణలు జరుగుతాయని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డా. ఏ మోహన్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఎక్స్‌పో వల్ల విజ్ఞార్జన జరుగుతుందని, అందువల్ల పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుందని అందుకు తమ కళాశాలలో ఉన్న కేంద్ర గ్రంథాలయం కూడా ఎంతో సహకరించగలదన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకు, వర్ధమాన ఇంజనీర్లకు వారి సజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుందన్నారు.

ఈ కార్యక్రమానికి నాలుగు రాష్ట్రాల 25 కళాశాలల నుంచి 450 బందాలు పాల్గొన్నాయి.ఉత్తమ ప్రదర్శన కనబర్చిన శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.10వేల నగదు, ద్వితీయ స్థానం లో నిలిచిన నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు రూ.7 వేల నగదు, తతీయ స్థానంలో నిలిచిన గోకరాజు రంగరాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమ సమన్వయకర్తలు డీన్ సీఎస్ఈ డా. డి మురళి, సీఎస్ఈ విభాగాధిపతి డా.జి రాము, ఎఫ్ఎంఈ విభాగాధిపతి కిరణ్మయి, ప్రొ.డా.డివెంకట్రావు, ఈఈఈ విభాగాధిపతి డా. శశికళ, ప్రో.డా.దిలీప్ రెడ్డి, ప్రొ.శ్రీ లక్ష్మి, మెకానికల్ విభాగాధిపతి అశోక్ కుమార్, ఎంబీఏ విభాగాధిపతి నాగరాజు,సివిల్ విభాగాధిపతి వెంకటేశ్, డీన్ ఐసిటి శ్రీనివాస్, ప్రొ.సౌమ్య, ప్రొ.వరప్రసాద్, జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, ప్రొ.దినకరన్, రాజేష్ వివిధ విభాగపు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మానవాళికి
విముక్తి చూపించేది ఎర్ర జెండానే



- సీపీఐ (ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రపంచ మానవాళికి విముక్తి చూపించేది ఎర్ర జెండా మాత్రమేనని సీపీఐ (ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో పార్టీ 24వ జాతీయ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదాను, పఠనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. చదువుతూ సమాజాన్ని మార్చాలని ప్రపంచంలో దోపిడి, పీడన, వివక్షత, అణచివేత, ఆర్థిక సమానతలు ఉన్నంతకాలం కమ్యూనిజం అజేయంగా నిలుస్తుందన్నారు. దేశ భవిష్యత్తును మార్చేది, అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టు ప్రభుత్వంలో మాత్రమే ఉంటుందని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దేవదానం, పార్టీ నాయకులు మల్లారెడ్డి, ఆంజనేయులు, కే.శీను, యాదవ రెడ్డి, తిమ్మప్ప, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సంబంధిత అధికారులకు పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. స్థానిక బస్తీలలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో, దాసరి బస్తీ కమ్యూనిటీ హాల్, కెమికల్ నాలా రిటైనింగ్ వాల్, స్మశాన వాటికలలో మౌలిక వసతులు గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోరావాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ భాగం డీఈ నిఖిల్ రెడ్డి, ఇన్‌చార్జి ఏఈ ఆశ, అసిస్టెంట్ ఏఈ. కవిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భీమిడి జైపాల్ రెడ్డికి
కొలన్ హనుమంత్ రెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) మెంబర్‌గా, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి నియమితులైన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని శుక్రవారం కలిశారు. అనంతరం భీమిడి జైపాల్ రెడ్డిని కొలన్ హనుమంత్ రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా భీముడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవి రావడానికి సహకరించిన హనుమంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతా రామ స్వామి దేవస్థానం చైర్మెన్ పేండం లక్ష్మి నారాయణ (నాని), ధర్మకర్తలు భీమిడి సంజీవ రెడ్డి (కొండల్ రెడ్డి), గుడిసెనీ హరికృష్ణ, తూంకుంట జగదీశ్ గౌడ్, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాఫర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వజ్జల శేశాంత్(బన్నీ), తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వీసీ





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎఫ్ఎల్ఎన్ ఫండమెంటల్ లిటరసీ, న్యూమరాసి (ప్రాథమిక స్థాయి విద్యార్థులకు భాషా గణిత సామర్థ్యాల సాధన) కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ లాట్స్ ద్వారా పైలెట్ ప్రాజెక్టు చేపట్టడం కోసం పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టనున్న ఈ పైలెట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూ టర్లను, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా రాష్ట్ర విద్యాశాఖ ద్వారా అందజేసే ఎఫ్ ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ద్వారా, పాఠ శాలలో భాషా గణిత సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థు లను ప్రత్యేకంగా గుర్తించి ఈ ప్రత్యేకమైన టూల్ ద్వారా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఇప్పటికే కంప్యూటర్లు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో వెంటనే ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించి, మరికొన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వివరించారు. ఈ వీసీలో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయ్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు వేసవి కాలం విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా ఎఫ్ 2 ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్డు,గాగిల్లాపూర్ చర్చి,చైతన్య కాలనీ,214 ప్రాంతంలలో అలాగే చైతన్య కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 01.00%ావీ% వరకు గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్డు,జగన్ వెంచర్,మోడీ బిల్డర్స్ లలో అలాగే సుందర్ ఆశ్రమం ఫీడర్ పరిధిలో ఉదయం 10.00గం ల నుండి మధ్యాహ్నం 01.00గం వరకు దుండిగల్ గ్రామం, నాగులుర్,తండా ఫీడర్ పరిధిలో తండా 1,గణపతి ఆశ్రమం ,పాక్షిక పారిశ్రామిక ప్రాంతం లలో అలాగే విర్కో ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 నుండి 01.00 గం వరకు తండా 2,పారిశ్రామిక ప్రాంతం లలో అలాగే రామ్కీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గం నుండి మధ్యాహ్నం 01.00గం వరకు రాంకీ ఎన్విరో పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని డిపి పల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్. సురేందర్ రెడ్డి తెలిపారు.

24న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్



నవతెలంగాణ-దుండిగల్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న జరగనున్న కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జర్నలిస్టులు అందరూ హాజరై.. జయప్రదం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీమ్, చిన్న, మధ్యతరగ పత్రికలకు గుర్తింపు, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. గత దశాబ్ద కాలంగా జర్నలిస్టులు రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు పెడుతున్న పాలకులు పెడచెవిన బెడుతూ.. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలంగడుపుతున్నారని విమర్శించారు. 2014 సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్రంలో అధికారం చలాయించిన బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకుండా దాటవేస్తూ వచ్చిందని తప్పుపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను గుర్తుంచుకొని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశా రు. అధికార ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్ కలెక్టరేట్ కార్యాల యం వద్ద చేపట్టనున్న భారీ ధర్నాలో జర్నలిస్టులు కలసికట్టుగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి విజ్ఞాపన పత్రం అందించనున్నట్టు ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

కోడ్ ఫ్యూజన్ హ్యాకథాన్ పోటీలు

- విజయం సాధించిన సెయింట్ మార్టిన్ కళాశాల విద్యార్థులు



నవతెలంగాణ-దుండిగల్

ఆల్వాల్‌లోని లయోలా అకాడమీలో గత మూడు రోజుల పాటు కోడ్ ఫ్యూజన్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకి దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలకి చెందిన ఏఐడీఎస్ విభాగానికి చెందిన థర్డ్-ఇయర్ విద్యార్థులు పోటీలలో పాల్గొని రన్నరప్‌గా రెండవ స్థానం సాధించారు. ఈ పోటీలలో పలు కళాశాలల నుంచి 57 జట్లు పాల్గొనగా సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యా ర్థులు అసాధారణ ప్రతిభ ప్రదర్శించి... 57 జట్లపై విజయం సాధించారు. ఈ పోటీలు మూడు దశల్లో నిర్వహించగా కళాశాల విద్యార్థులు అన్ని రౌండ్లలో విజ యవంతంగా గెలుపొందారని వారి అత్యద్భుత ప్రదర్శన వలన కళాశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచేలా చేసిందన్నారు. వారి కృషికి కళాశాల ప్రొఫెసర్ గ్రూప్ డైరెక్టర్, డా.పి.సంతోష్ కుమార్ పాత్ర, అభినందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మెన్ ఎం. లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్ యాదవ్, హెచ్ఓడి విభాగాధిపతి, విద్యార్థులందరినీ అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



- బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని శుక్రవారం కలిసి పలు ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేశారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.



130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన శ్రీశ్రీశ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని శుక్రవారం కలిశారు. ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివ రాత్రి మహెూత్సవానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వామి వారి కృపా కటాక్షములతో ప్రజలంతా సంతో షంగా ఉండా లని, మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడంలో నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి చందు, ప్రభాకర్, నాగరాజు పటేల్, నరేష్, మహేష్, వైభవ్, పవన్, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహెూత్సవ కార్యక్రమ కరపత్రికను బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పాక్స్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, దేవాలయ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు శంకరప్ప, కోశాధికారి వి. ప్రశాంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్ర రెడ్డి, పాండురంగం గుప్త, నామాల సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాశివరాత్రి, శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మహెూత్సవాలకు ఆహ్వానం..

శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్ల కళ్యాణ మహెూత్సవం..



మహేశ్వరం నియోజక వర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ వినాయక హిల్స్ కాలనీలో జాట్ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాజీ మందిర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు నవ్వారు మల్లారెడ్డి, ప్రతాప్ రెడ్డి, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

'నిబంధనలకు విరుద్ధంగా గోడౌన్ నిర్మాణం'

నవతెలంగాణ- నాగోల్

నివాస సముదాయాలలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ గోడౌన్‌ను నిర్మాణం చేస్తున్నారని నాగోల్ డివిజన్ పరిధిలోని మత్తుగూడ శ్రీ వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. పలుమార్లు ఈ విషయంపై పెద్దఅంబర్‌పేట్ కమిషనర్‌కు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. సర్వే నెంబర్ 122, 126 వ్యవసాయ భూమిలో అనుమతులు లేకుండా, నాలా కన్వర్షన్ చేయకుండా కమర్షియల్ గోడాన్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. గత రెండు నెలల ముందు అడ్డుకున్నామని, మళ్ళీ వచ్చి నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఓ 16 చక్రాల లారీ 30 ఫీట్ రోడ్డులో వెళ్లలేక ట్రాన్స్ఫార్మర్ ను ఢీ కొట్టడంతో భారీ నష్టం జరిగిందని తెలిపారు. ఆ లారీ డ్రైవర్ మద్యం సేవించి రోడ్డు మీదే బస చేస్తారని, ఆడవాళ్ళు, పిల్లలు ఆ రోడ్లో వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రణీత్ రెడ్డి, అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఆస్పత్రిలో

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ -ఎల్బీనగర్

వనస్థలిపురం ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మొట్టే నర్సింహ మాట్లాడుతూ కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం కార్మికులకు ప్రతి నెలా ఏడవ తేదీలోపు జీతాలు చెల్లించవలసి ఉన్నప్పటికీ వనస్థలిపురం ఆస్పత్రిలో బీజేఆర్ కాంట్రాక్టు సంస్థలో పనిచేస్తున్న 13 మంది కాంట్రాక్టు కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. అలాగే టీవీ టీ కాంట్రాక్టు కింద పని చేస్తున్న 50 మంది కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నిబంధనలకు విరుద్ధంగా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. సమయానికి జీతాలు చెల్లించని, తక్కువ జీతాలు చెల్లిస్తున్న కాంట్రాక్టర్లపై ఆస్పత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు జాతీయ ఆర్థిక సెలవులు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్టర్లు కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీజేఆర్ మాన్ పవర్ సర్వీసెస్ అను కాంట్రాక్టు సంస్థ వారు ఏడు నెలల కిందట 13 మందిని నియమించుకుని నేటికి కూడా వారికి జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుండి బిల్లులు రాకుండా కాంట్రాక్టర్లు మూడు నెలలు జీతాలు చెల్లించవలసి ఉన్న నేటికీ కూడా కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, వారిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం జీతాలు చెల్లించని కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బొయపల్లి రాములు గౌడ్, రమావత్ శక్రు నాయక్, ఏఐటీయూసీ హయత్ నగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెంది వెంకట్, గోల్కొండ నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు కృష్ణ, కాంట్రాక్టు కార్మికులు కిరణ్, భాగ్య, స్టాలిన్, పద్మ శ్యామల, మంగ పాల్గొన్నారు.

పండ్లను పండించడంలో

ప్రమాదకరమైన రసాయనాల వాడకం



- మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లిన సీఆర్‌వో సంస్థ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మామిడి పండ్లు, ఇతర పండ్లను పండించడంలో ప్రమాదకర రసాయనాలైన ఈథెఫాన్, ఇథైల్ వంటి వాటిని విపరీతంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ గైడ్లైన్స్‌ని పట్టించుకోకుండా ఎక్కువ మోతాదులో వాడుతున్నారని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది పక్వానికి రాక ముందే చెట్టు నుంచి మామిడి పండ్లను కోసి కృత్రిమ పద్ధతిలో ఎఫ్ఎస్ఎస్ఏఐ గైడ్‌లైన్స్ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా అధిక మోతాదులో హానికరమైన రసానాలతో పండ్లను మాగించి మార్కెట్‌లో విక్రయించారని తెలిపారు. గతేడాది దాదాపు 25 లక్షల మెట్రిక్ టన్నుల మ్యాంగోలను కృత్రిమ పద్ధతిలో ఎక్కువ మోతాదు కెమికల్స్‌తో పండించినవే అని తెలిపారు. ఇవి తినడం వల్ల వినియోగదారుల ఆరోగ్య పరిస్థితి ప్రమాదకంగా మారే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే రానున్న రోజుల్లో సీజనల్ ఫ్రూట్ మ్యాంగో, ఇతర పండ్లను మగ్గించే విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని కృత్రిమ పద్ధతి వ్యవహారంపై దృష్టి సారించి వినియోగదారుల ప్రాణాలను కాపాడాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సీఆర్‌వో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శివకుమార్, వి.రవి, డి.కిరణ్ కుమార్, ఆర్.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ పట్టా పాసు బుక్కులివ్వాలి

- రైతు బంధు, రైతుబీమా వచ్చేటట్టు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి
- గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు
- ఇప్పటికైనా అధికారులు స్పందించాలి, లేదంటే పోరాటం ఉధృతం చేస్తాం
- అనాజీపూర్ గ్రామ పంచాయతీ ఎదుట బాధిత రైతుల నిరసన సభలో పగుడాల యాదయ్య

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అనాజ్‌పూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం.281లో 125 మంది రైతులకు సంబంధించిన భూ వివరాలు ఆన్లైన్ చేసి పట్టా పాస్ బుక్స్ ఇవ్వాలని సీపీఐ (ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. బాధిత రైతులతో కలిసి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనాజీ పూర్ గ్రామపంచాయతీ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ (ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య హాజరై మాట్లాడారు. అనాజీపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం.281, 275, 276, 278లో సుమారుగా 125 ఎకరాలకు గాను ఒక్కొక్కరికి ఎకరం చొప్పున 125 మందికి 1991లో పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి, ఆన్లైన్ చేసి పాసు బుక్కులు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కానీ తదనంతరం తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆన్లైన్ తీసేసి పాస్ బుక్కులు ఇవ్వకపోవడం వలన రైతులకు రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలు అందకుండా చేశారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాసు బుక్కులు ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలో ఫిలిం సిటీ, సంఘీ మొదలగు భారీ పరిశ్రమలు ఉండడం వల్ల ఇక్కడ భూములకు అధిక డిమాండ్ ఉండడం వలన ఈ భూమిపై అధికారులు, ప్రజా ప్రతినిధుల కన్ను పడడంతో ఎలాగైనా ఆ భూములను రైతుల నుండి లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే పాస్ బుక్కులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇక్కడి రైతులకు ఈ భూమి తప్ప మరేలాంటి జీవన ఆధారం లేదన్నారు. భూమిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు తమ పిల్లల పెళ్లిళ్లకు అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నేడు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పాస్ బుక్కులు ఇచ్చి ఆన్ లైన్‌లో నమోదు చేసి రైతు బంధు, రైతు బీమా ఇవ్వాలని కోరారు. లేకుంటే రైతులకు పాసు బుక్కులు ఇచ్చేంతవరకూ ఎర్రజెండా రైతుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. 30 ఏళ్ల కిందట ఈ భూమి రైతులకు పంచాలని పోరాటం చేసి పట్టా సర్టిఫికెట్లు ఇప్పించిన ఘనత సీపీఐ(ఎం) పార్టీదని గుర్తు చేశారు. భూ సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చొరవ తీసుకొని రైతులకు పాస్ బుక్కులు ఇప్పించాలని కోరారు. ఈ నిరసన సీపీఐ (ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, బోడ సామిల్, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, వెంకటేష్ ముగ్గు రాములు, మండల కార్యదర్శి నర్సింహా, మండల కమిటీ సభ్యులు గుండె శివ, ఆలేటి ఆటం, వర్గాల ముత్యాలు, వర్గాల బాలరాజ్, పెండ్యాల బిక్షపతి, ఎరుకలి మహేందర్, ఎలకపల్లి మహేష్, రవి, కృష్ణ, కడారి శ్రీనివాస్, కావలి రాములు, కావలి మల్లేష్, కావలి జంగయ్య యాదయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్షిప్‌కు న్యూ చైతన్య స్కూల్ విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలకు న్యూ చైతన్య స్కూల్ నుండి విద్యార్థిని ఎంపికైనట్టు స్కూల్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుండి 23 వరకు జరిగే జిల్లా కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలు వికారాబాద్‌లో జరుగుతున్నాయని తెలిపారు. ఈ పోటీలకు మా స్కూల్ నుండి 9వ తరగతి చదువుతున్న అమ్మాయి ప్రియాంక సెలెక్ట్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల పోటీల్లో ముందుండాలని సూచించారు. అనంతరం ఆ విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

పాదచారులు నడిచేదెలా...?



నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్ చౌరస్తా నుండి విజయవాడ జాతీయ రహదారి వైపుకు రోడ్డుకు ఇరువైపులా హయత్ నగర్ వరకు వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి.. వ్యాపార సముదాయాల సామాగ్రిని పెట్టుకున్నారు. ఇంకా సాయంత్రం వేళల్లో వైన్ షాపుల వద్ద, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద, షాపింగ్ మాల్స్ వద్ద, కార్లు, ద్విచక్ర వాహనాలు నిలపడంతో పాదచారులు నడిచేందుకు దారి లేకుండా పోయింది. ఈ క్రమంలో పాదచారులు రోడ్డు మార్గాన వెళ్తున్నారు. ఈ కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు ప్రమాదాలకు కూడా కారణం అవుతోంది.



అసలు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఉన్నా కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ముఖ్యంగా మన్సూరాబాద్, హయత్ నగర్ డివిజన్లో ఉన్న రహదారి ప్రాంతాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. వాటిని తొలగించి పాదచారుల కోసం ఉంచిన ఫుట్ పాత్ లను వారికి కేటాయించే విధంగా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



రోజు రోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతుంది. దీనికి తోడు ఫుట్‌పాత్‌లను కొందరు చిరువ్యాపారులు ఆక్రమించుకుంటున్నారు. ఇంకా కొంతమంది ఫుట్‌పాత్‌లపైన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పాదచారులు నడిచేందుకు గజం స్థలం కూడా ఉండడం లేదు. ఈ క్రమంలో పాదచారులు వెళ్లే దారిలో కాకుండా రోడ్డు మార్గాన వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఫుట్ పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారులను ఆక్రమించి ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించి ఎవరు కూడా వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదు. త్వరలోనే హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తాం.

- హాయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

జీహెచ్ఎంసీ సహకారంతో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తాం

జీహెచ్ఎంసీ సహకారంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యాపారస్తులు, అధికారులకు సహకరించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపునకు పూర్తిగా సహకరించాలి. రోజు రోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగిపోతుంది. రోడ్లపై వ్యాపారాలు చేస్తే ప్రమాదాలు జరుగుతాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తాం.

- రాచకొండ ట్రాఫిక్- 2 డీసీపీ శ్రీనివాసులు

డ్రంక్ అండ్ డ్రైవ్ మీద ఉన్న శ్రద్ధ ట్రాఫిక్



నియంత్రణపై లేదు..

సాయంత్రం ఐదు గంటలు దాటితే పలు కార్యాలయాల నుండి ఉద్యోగులు తమ తమ ఇండ్లకు చేరుకున్న సమయంలో ముఖ్యంగా కామినేని చౌరస్తా నుండి సహారా మీదుగా సుష్మా వైపు వెళ్లే వాహనదారులు మన్సూరాబాద్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీతో నిలిచిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కూడా దారితీస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పెడుతున్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై పెట్టడం లేదని పలువురు వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులపై మండిపడుతున్నారు. చూడాలి మరి ట్రాఫిక్ నియంతలకు అధికారులు ఏ విధంగా సహకరిస్తారో..

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం



మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఓ వరం లాంటిదని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బాలాపూర్ గ్రామానికి చెందిన జెట్టే భిక్షపతికి ప్రభుత్వం నుండి రూ.60వేల చెక్కును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారంతో మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి మంజూరు చేయించారు. ఈ మేరకు ఆ చెక్కును బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రైతు సేవ సహకార సంఘం' ఆస్తి పన్ను చెల్లింపు

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సి పాలిటీలోని తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘానికి చెందిన 10 ఆస్తులకు సంబంధించి మున్సిపల్ పన్ను రూ. 8,66,604 చెక్కును టిజిసిఏ బి వైస్ చైర్మెన్, హెచ్ డి సిసిసీబీ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య శుక్రవారం మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు సకాలంలో పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. పన్నుల ద్వారా దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ సహకార సంఘం సెక్రెటరీ వై. రాందాస్, మున్సిపల్ ఆర్వో శ్రీనివాస్, మున్సిపాలిటీ సిబ్బంది ప్రశాంత్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



'హెూర్డింగ్స్' సమస్య పరిష్కారానికి కృషి

- మధుయాష్కీ గౌడ్



నవతెలంగాణ -ఎల్బీనగర్

హెూర్డింగ్స్ వ్యాపారస్తుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. నగర శివారు మున్సిపాలిటీలలో ఇటీవల హైడ్రా అధికారులు హెూర్డింగ్స్ తొలగింపు నేపథ్యంలో హెూర్డింగ్స్ వ్యాపారస్తులు శుక్రవారం మధుయాష్కిగౌడ్‌ని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు మాట్లాడుతూ అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్స్ తొలగింపుతో తాము రోడ్డున పడుతున్నామని, ప్రభుత్వంతో మాట్లాడి తమ ఇబ్బందులను తొలగించాలన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలలోనూ స్వయం ఉపాధిలో భాగంగా గత 20 ఏళ్లకు పైగా తాము అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగు వ్యాపారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి అన్ని విధాలుగా ట్యాక్స్ చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ వ్యాపారంపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాదాపు 10 వేల మంది వరకు ఆధారపడ్డామని పేర్కొన్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురి చేసిందని, జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్కసారిగా హెూల్డింగ్స్ ను తొలగించడంతో తామంతా రోడ్డున పడ్డామన్నారు. దీంతో శివారు మున్సిపాలిటీలు, జిల్లాలకు మా హెూల్డింగ్స్‌ను తరలించామన్నారు. ఆ తరువాత కరోనా రావటంతో వ్యాపారం సాఫీగా సాగక ఎంతో మంది అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మమ్మల్ని అన్ని విధాలుగా నష్టం చేయడంతో తామంతా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతగా నిలిచామన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొస్తామని చెప్పి సిడిఎండి ఆన్లైన్ పోర్టల్ ను నిలిపివేయడంతో హెూర్డింగ్స్‌కు అనుమతి తీసుకోవడం, టాక్స్ కట్టుకోవడం వీలు కాలేదన్నారు. ఈ క్రమంలో 2024- 25 సంవత్సర టాక్స్ కట్టలేక పోయామన్నారు. కానీ ఇటీవల హైడ్రా అధికారులు తమ హెూర్డింగ్స్ తొలగించడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాక్స్ చెల్లిస్తామని, అనుమతులు ఇవ్వాలని చెప్పినా వినకుండా హెూర్డింగ్స్‌ను తొలగిస్తుండడంతో తాము రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వందల హెూర్డింగ్స్‌ను తొలగించి తమను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. కానీ కొత్తగా పెద్ద పెద్ద కంపెనీలకు అనుమతులు ఇస్తూ తమలాంటి చిన్న వ్యాపారస్తులను రోడ్డున పడేయడం సబబు కాదన్నారు. స్పందించిన మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. హెూర్డింగ్స్ వ్యాపారస్తుల సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ - మీర్ పేట్

లెనిన్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం కొంత సమయం విద్యుత్ అనంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వి.శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. లెనిన్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో 33/11కెవి లైన్ సంబంధించిన కాలనీలో శ్రీ విద్య టౌన్షిప్, శాంతి నగర్, బడంగ్ పేట్, బడంగ్ పేట్ పాత గ్రామం, షిరిడి ఎన్క్లేవ్, చంద్ర నగర్, భాగ్యకళ నగర్, సాయి నగర్, ఉద్యోగ నగర్, ప్రశాంతి నగర్ ఫేజ్ -1, మురళీకృష్ణ నగర్, బృందావనం కాలనీ, లోకాయుక్త కాలనీ, మల్లికార్జున నగర్‌లలో ఉదయం 10 గంటల 30 నిముషాల నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వెల్లడించారు. బడంగ్‌పేట్ ఏరియా పరిధిలో మరమ్మత్తులు చేస్తున్నందున కరెంట్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నాచురల్ ఆరిఫైస్ స్పెసిమెన్ ఎక్స్ ట్రాక్షన్ రోబోటిక్ సర్జరీ

- తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి సారిగా కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో శస్త్రచికిత్స
- పొత్తి కడుపు కోయకుండానే పెద్దపేగు క్యాన్సర్ కణితి తొలగింపు





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెండింగ్‌లో ఉన్న లేఔట్లను ఎల్ఆర్ఎస్ పథకం కింద క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా అక్రమ లేఔట్ల పేరుతో ప్లాట్లు రిజిస్ట్రేషన్లు ఆపేయడం ఎల్ఆర్ఎస్‌కి అప్లై కాకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న భూ యజమానులకు ఊరట కలిగిస్తూ ఎల్ఆర్ఎస్ పథకం లైన్ క్లియర్ చేస్తూ సంబంధించిన జీవోని విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్‌కి లైన్ క్లియర్ చేసినందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలకు సంబంధిత మంత్రులకు ధన్యవాదాలు తెలిచేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లగా అక్రమ లేఔట్ల పేరుతో ఓపెన్ ప్లాట్లు రెజిస్ట్రేషన్ చేయకపోవటం, ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధిత పర్మిషన్లు రాకపోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భూ యజమానులకు ప్లాట్ల కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ విషయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో చేసిన హామీల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌కి సంబందించిన ఇబ్బందులు తొలగిస్తాం లేఔట్లను రెగ్యూలరైజ్ చేస్తామని చెప్పినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య భూ యజమానులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న లేఔట్ల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

'మాతృదేవోభవ' ఆశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తాం



ఆదిబట్ల ఎస్.ఐ వెంకటేష్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి రాచకొండ పోలీస్ కమిషనరేట్, ఆదిబట్ల పోలీసుల తరపున ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తామని ఆదిబట్ల ఎస్.ఐ వెంకటేష్ తెలిపారు. హైద్రాబాద్ నగర శివారు ప్రాంతమైన బొంగ్లూర్ పరిసర ప్రాంతంలో మతిస్థిమితంలేని వ్యక్తి.. నిర్మానుష్య ప్రాంతంలో గత మూడు, నాలుగు రోజులుగా మాసిన బట్టలు, కాలికి గాయంతో దుర్భరమైన స్థితిలో తిరుగుతున్నాడు. స్థానికులు గమనించి మాతృదేవోభవ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరికి సమాచారం అందించారు. వెంటనే ఆయన తన టీంతో కలిసి అక్కడికి చేరుకొని ఆ వ్యక్తి వివరాలు కనుకోనగా.. తనపేరు మురుగదాస్, తమిళనాడు అని మాత్రమే చెప్తున్నాడని గట్టు గిరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆదిబట్ల ఎస్.ఐ వెంకటేష్ సమక్షమంలో ఆ వ్యక్తిని చేరదీసినట్టు గట్టు గిరి తెలిపారు. అనంతరం ఎస్.ఐ వెంకటేష్ మాట్లాడుతూ మతిస్థిమితం సరిగ్గా లేని అభాగ్యులను చేరదీసి, వారికి అన్నిరకాల వసతి, మానసిక వైద్యాన్ని అందించి మాములు మనుషులుగా మార్చి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చుతున్న గట్టు గిరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వ్యాపార సాధన కిట్ల పంపిణీ

నవతెలంగాణ-తుర్కయంజాల్

భారత్ కేర్ వాస్తు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఊంచి ఉదాన్ ప్రోగ్రామ్ సంయుక్తంగా 42 మంది లబ్ధిదారులకు శుక్రవారం వ్యాపార సాధన కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లలో బ్యూటీ ఎక్విప్‌మెంట్, టైలరింగ్ మెషీన్లు, ప్రింటర్లు, మైక్రోవేవ్స్ మరియు ఇతర అవసరమైన సాధనాలు ఉన్నాయి. ఈ సందర్భంగా భారత్ కేర్ వాస్తు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ నేషనల్ క్రెడిట్ హెడ్ మురళీ దారా మాట్లాడుతూ.. ఆర్థిక స్వావలంభన, నైపుణ్య అభివృద్ధి అనేది సమాజ అభివృద్ధికి కీలకమన్నారు. ఈ వ్యాపార సాధన కిట్లను అందించడం ద్వారా లబ్ధిదారులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడమే మా లక్ష్యమన్నారు. ఊంచి ఉదాన్ ప్రోగ్రామ్ ఆర్థిక స్థిరత సాధించేందుకు అవసరమైన సహాయం, వనరులు అందిస్తున్నదన్నారు. దీని ద్వారా నిరుపేదల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ కేర్ వాస్తు ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ హెచ్ఆర్ విభాగం ప్రతినిధి సుష్మా, స్వప్న, క్రెడిట్ మేనేజర్ వర్షారెడ్డి, గుంజన్, సందీప్, చిరంజీవి, ముఖ్య కోఆర్డినేటర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ కోసం ఓపెన్ జిమ్‌లు

కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ - చంపాపేట్

ఫిట్నెస్ కోసం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో కర్మన్‌ఘాట్ క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో దుర్గ నగర్ కాలనీ, కాంతి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, ఐమాస్ట్ లైట్‌లను శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం, బహిరంగ ప్రదేశాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా వాటిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లింగాల దశరథ్ గౌడ్, శేఖర్ గౌడ్, సుంకరి రమేష్ గౌడ్, శ్రీధర్ గౌడ్ వేణు గౌడ్, కృష్ణ, క్రాంతి యువజన సంఘం అధ్యక్షులు వంగ వెంకట్ రెడ్డి, బాబు గౌడ్, చీర సత్యనారాయణ, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు ఆనంద్, దుర్గ నగర్ కాలనీ అధ్యక్షులు యాదగిరిరెడ్డి జగన్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

విద్యార్థిని అదృశ్యం

నవతెలంగాణ -నాగోల్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీకి చెందిన చైతన్యపురిలోని చైతన్య జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న వాక మీనాక్షి అనే విద్యార్థిని ఈ నెల 20న కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి.. తిరిగి ఏడున్నర గంటలకు పానిపూరి బండి వద్దకు వెళ్లి కడుపునొప్పి వస్తుందని తల్లీదండ్రులకు సమాచారం ఇచ్చిందని ఎస్ఐ తెలిపారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు తిరిగి ఫోన్ చేస్తే సమాధానం రాలేదని అక్కడికి వెళ్లి చూసిన అక్కడ లేకపోవడంతో తిరిగి ఇంటి వచ్చారు. దీంతో ఇంటి పరిసర ప్రాంతాలలో మరియు బంధుమిత్రుల వద్ద ఆమె ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు తండ్రి వాక నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివ నాగ ప్రసాద్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్
అసోసియేషన్ రీజినల్ కాన్ఫరెన్స్



నవతెలంగాణ -నాగోల్

అఖిల భారతీయ జి.ఎస్.ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రీజినల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అండ్ హెచ్ఓడి సూరజ్ దోమాజీ ఫత భజే హాజరయ్యారు. గత 35 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సేవలను అందించిన రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణను శాలువా పూల మాల, పగడితో ఘనంగా సన్మానించారు. రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ మాట్లాడుతూ.. జిఎస్ఐలో రిజర్వేషన్ రోస్టర్లను సక్రమంగా నిర్వహించటానికి కృషి చేయాలనీ, ఎప్పటికప్పుడు సమీక్షించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టలను త్వరలో భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ ఆదర్ల మహేష్, ప్రతినిధులు బి. లింగ్య, జె. రాజశేఖర్, అర్. అరుంకుమార్, బి. ఆనంద్ కుమార్, ఈ. చంద్రయ్య, ఎం. చెక్రెశ్వర్, ఏ. శివ శంకర్, డి. దయానంద్, జి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి'



నవతెలంగాణ – మీర్ పేట్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మీర్ పేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు కేంద్రం నుండి ఇప్పటి వరకు విడుదలైనటువంటి నిధుల, పూర్తయిన పనులను మిగిలిపోయిన పనుల వివరాలను కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018వ సంవత్సరం నుండి జనవరి 31 2025 సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమృత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ మిషన్స్ సంపూర్ణంగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లావ్యాప్తంగా అమలు అయ్యే విధంగా దిశా కమిటీ చైర్మెన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. జిల్లా దిశా కమిటీ సభ్యులుగా ముందుగా మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, జిహెచ్ఎంసి డివిజన్‌లలో పర్యటిస్తున్నామని అందులో భాగంగా ఈరోజు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరుతున్నాయా లేదా అని ప్రతి బీజేపీ కార్యకర్తలు తనిఖీలు చేయాలని, ప్రజలకు చేరే విధంగా చూడాలని సూచించారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ మాజీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహా, కిసర కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ సభ్యులు అంబోజి శ్రీనివాస్ శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శ్రీధర్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు గొరిగే మల్లేష్, సంతోష్‌తో కలిసి 2018వ సంవత్సరం నుండి జనవరి 31 2025 సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమృత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ మిషన్స్ ద్వారా విడుదలైన నిధుల, పూర్తయిన పనులను మిగిలిపోయిన పనుల వివరాలను కోరుతూ జల్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ బి. వెంకట్రామ్ కు వినతి పత్రం అందజేశారు.





ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ మలక్‌పేట్

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మదీనా మస్జిద్ లేన్, ఖజానీకి బౌలి లేన్, ఆయేషా మజీద్ లేన్ వివిధ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మంచినీరు కలుషితం అవ్వకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చౌడి డివిజన్లో కొత్తగా వేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని అన్నారు. అవసరమైన చోట్ల సీసీ రోడ్లను త్వరలో వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోనీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి, టీజీఎస్ పిసిడిఎల్ వివిధ శాఖ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ – హయత్ నగర్

గణేష్ నగర్ 11కెవి ఫీడర్.. గణేష్ నగర్, కుంట్లూర్, నారాయణ కాలేజ్, శివశంకర్ కాలనీ, రత్న కాలనీ, ఇష్ట కామేశ్వరి టెంపుల్ పరిసర ప్రాంతాల్లో, కుంట్లూర్ 11 కెవి ఫీడర్.. కుంట్లూరు ఏజీఎల్, తట్టి అన్నారం ఏజీయల్, రావి నారాయణరెడ్డి కాలనీ పరిసర ప్రాంతాల్లో, లక్ష్మీ గణపతి 11కేవీ ఫీడర్.. జే కన్వెన్షన్ హాల్, లక్ష్మీ నగర్ కాలనీ, 11కేవీ తట్టి అన్నారం ఫీడర్.. తట్టి అన్నారం, ఆర్ కే నగర్, వనస్థలిహిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయ్ గూడ, మర్రిపల్లి పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు, 11కేవీ హుడా సాయి నగర్ ఫీడర్.. జడ్జెస్ కాలనీ, విజయ శ్రీ కాలనీ, వివేకానంద నగర్,సహారా ఎస్టేట్స్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

హోటల్‌లో ఆహార శాఖ అధికారుల తనిఖీలు



నవతెలంగాణ మలక్‌పేట్

మలక్‌పేట్ నియోజకవర్గ వర్గ పరిధిలోని ఆజంపులలో ఉన్న పలు హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆహార తనిఖీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న హెూటల్స్ గుర్తించినట్టు పేర్కొన్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, పాడైపోయిన చికెన్ వాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెూటల్స్ లో పనిచేసే సిబ్బంది నిబంధనల ప్రకారం ఉండాలని, అపరిశుభ్రంగా ఉంటే సహించమన్నారు. వంట చేసే గదుల్లో కిటికీలు ఉండి ఆవిరి బయటకి వెళ్లేలా ఉండాలని వ్యాపారులకు సూచించారు.

25న ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన మాదిగలకు స్మారక దినోత్సవం

నవతెలంగాణ - బంజారా హిల్స్

మాదిగ,మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదిన ఉదయం 11 గంటలకు హైదరాబాదు లోని టూరిజం,హరిత ప్లాజా హెూటల్ (సమగమం హాల్,2 వ ఫ్లోర్) లో నిర్వహించే ముఖ్య సమావేశంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన అన్ని కుల సంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తు మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ సామాజిక వర్గ అమరవీరుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించేందుకు, అమరవీరుల స్థూపం ఏర్పాటు పై నిర్వహించనున్న సమావేశంలో రాష్ట్రం లో ఉన్నా మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని మాదిగ,మాదిగ అనుబంధ కులాల సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



కుంభమేళా కోసం

76 ప్రత్యేక రైళ్లు నడిపిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్ పట్టణ ప్రాంతం నుండి ప్రయోజనం పొందిన 1.4 లక్షల మంది ప్రయాణికులు

నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుతం జరుగుతున్న మహా కుంభమేళా - 2025 సందర్భంగా భారతీయ రైల్వే దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది.ఈ కుంభమేళా కోసం రైల్వే శాఖ మొత్తం 13,000కి పైగా రైళ్లను నడపాలని ప్రణాళిక రూపొందించగా, ఇప్పటివరకు 12,583 రైళ్లు ఇదివరకే నడిపాయి. 2025 జనవరి 13 నుంచి ఇప్పటివరకు 3.09 కోట్ల మంది భక్తులు భారతీయ రైల్వే ద్వారా ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు చేరుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ రంగుల కోడ్ కలిగిన టిక్కెట్లను జారీ చేయడం, అదనపు ఆశ్రయ ప్రాంతాలను ఏర్పాటు చేయడం వంటి విస్తృత ఏర్పాట్లు చేసింది.దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు భారీ సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడిపింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ పట్టణ ప్రాంతం నుండి ఇప్పటివరకు 76 రైళ్లు నడిపింది, వీటిలో సాధారణ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లూ ఉన్నాయి. ఈ రైళ్లు జనవరి మరియు ఫిబ్రవరి నెలల్లో కుంభమేళా కాలంలో వివిధ తేదీల్లో నడిపినవి. ఈ ప్రత్యేక రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ పూర్తిగా భర్తీ అయ్యింది. ఈ రైళ్ల సామర్థ్యానికి మించి 144 శాతం ఆక్యుపెన్సీతో రైళ్లు నడుస్తున్నాయి. ఇప్పటివరకు, అంటే 2025 ఫిబ్రవరి 21 నాటికి, హైదరాబాద్ ద్వీపురి ప్రాంతం నుండి దక్షిణ మధ్య రైల్వే నడిపిన ఈ రైళ్లలో సుమారు 1.4 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేశారు. ఈ రైళ్లు ప్రయాగ్‌రాజ్ చెయోకి మార్గంగా గయా, పాట్నా, ఆజంఘడ్, వారణాసి, దానాపూర్, రక్సౌల్ వంటి ప్రధాన గమ్యస్థానాలకు నడిపినవి. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్, చర్లపల్లి, కాచిగూడ, మౌలా-అలి స్టేషన్ల నుంచి కార్యకలాపాల్లోకి తెచ్చాయి అని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి దక్షిణ మధ్య రైల్వే ఎ. శ్రీధర్ పేర్కొన్నారు.

ఘంటసాల, బాలు పాటలు తెలుగు భాషకు వన్నె తెచ్చాయి



నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత గాయకులు ఘంటసాల ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాటలు తెలుగు భాష కు వన్నె తెచ్చాయి అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. వారి పాటలో మాధుర్యం మాత్రమే కాక తెలుగు భాష ఉచ్చారణ భాష లోని అందం శ్రోతలకు అందించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ సందర్భంలో వీరి పాటలు ఎంపిక చేసుకోవటం సముచితం గా ఉందన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) నిర్వహణలో ప్రముఖ గాయకుడు దాసరి శ్రీహరి సారథ్యం లో పాటకు పట్టాభిషేకం పేరిట ఘంటసాల బాలసుబ్రహ్మణ్యం సినీ గీతాలను వై ఎస్ రామ కృష్ణ ఇందునయన సురేఖ మధురం గా ఆలపించారు. శ్రీ హరి సహా గాయకులు తో కలసి ఆలపించి వాడిన పూలే వికసించేనే పాటను సుమధుర స్వరం తో పాడారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వంశీ రామరాజు పాల్గొని గాయకులను సత్కరించి మాట్లాడారు. నేటి వారికి ఘంటసాల పాటలు వినిపిస్తే తెలుగు భాష పై మక్కువ పెరుగుతుందని చెప్పారు ఉత్తమ కార్యక్రమాలు చేసే వారికి వంశీ సంస్థల సహకారం అందిస్తామని తెలిపారు. సుధామయి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమం లో సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొనగా లలిత కార్యక్రమ నిర్వహణ చేశారు



విద్యార్థులకు నగదు, పతకాలు ప్రదానం..

నవతెలంగాణ-చంపాపేట్

చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ పరిధిలోని శ్రీచైతన్య పాఠశాలలో జాతీయస్థాయిలో నిర్వహించిన "నాలెడ్జ్ ఎసెస్మెంట్ మెంట్ టెస్ట్ (కే ఏ టి) లో వివిధ విభాగాలయందు ప్రతిభను చాటిన విద్యార్థులకు నగదు, పతకాలను, సర్టిఫికెట్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫణిమాధవి బహుకరించి విద్యార్థులను అభినందించారు. శుక్రవారం జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరిక్షలో ఒక విద్యార్థినికి రూ.2 వేలు, 15 మంది విద్యార్థులకు రూ. 1000/- నగదు బహుమతి చొప్పున, పతకాలు, సర్టిఫికెట్స్, 85 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిపికెట్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజియం. సతీష్ ఆర్.ఐ రవీందర్ రెడ్డి, ఆకాడమిక్ కో ఆర్టినేటర్ రఘు వంశీ, ప్రిన్సిపాల్ ఫణీమాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్ సింగ్ దీన్ సతీష్, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

జబ్బులు నయానికి మందులు.. మనసులో బాధ నివారణకు హాస్యం



● **శాసన సభ సభాపతి గడం ప్రసాద రావు**

నవతెలంగాణ-కల్చరల్

జబ్బులు నయానికి మందులు మనస్సు లోని బాధలు నివారణకు హాస్యం అవసరమని రాష్ట్ర శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద రావు అన్నారు. తన చిత్రాలతో హాస్యాన్ని పండించిన జంధ్యాల నటి గా 200 సినిమాలలో నటించి దర్శకురాలుగా నలభై ఐదు సినిమాలకు దర్శకత్వం వహించిన విజయ నిర్మల తెలుగు సినీ పరిశ్రమలో శాశ్వతంగా నిలిచి ఉంటారని ఆయన నివాళులు అర్పించారు. ఇరువురి జయంతి ఒక్కరోజే కావటం యాదృచ్ఛిక మని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై శ్రుతి లయ ఆర్ట్స్ సీల్ వెల్ కార్పొరేషన్ కళా కారుల ఐక్య వేదిక నిర్వహణలో ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడికి విజయ కృష్ణ సిల్వర్ క్రౌన్ సత్కారం జరిగింది ముఖ్య అతిథిగా ప్రసాద్ రావు పాల్గొని అనిల్ రావిపూడి నీ సత్కరించి మాట్లాడారు. అనిల్ సున్నిత హాస్య రసాన్ని పండించే సినిమాలకి దర్శకత్వం వహించి విజయవంతం గా సాగుతున్నారని అభినందించారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమకు విడదీయరాని సంబంధం వుందని గద్దర్ అవార్డ్స్ ప్రభుత్వం ఇవ్వబోతోందని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ జంధ్యాలకు తాను ఏకలవ్య శిష్యుడు అని తెలిపారు. జీవితం లో మనస్సుని గాయ పరచినవారు నవ్వులను పంచిన వారిని మరువ లేమని జంధ్యాల నవ్వులు పంచారని చెప్పారు. విజయ నిర్మల మహా దర్శకురాలు అని కొనియాడారు. నటుడు నరేష్ మాట్లాడుతూ తల్లి విజయ నిర్మల గురువు జంధ్యాల తన ఎదుగుదలకు దోహదం చేశారని చెప్పారు. హాస్యం పాదరసం లా మార్చే శక్తి అనిల్ రావిపూడి వద్ద వుందని ప్రశంసించారు. న్యాయ మూర్తి మాధవ రావు అధ్యక్షత వహించిన సభలో నటి శ్రీలక్ష్మి పవిత్ర నరేష్ నటులు మంచు విష్ణు ,ప్రదీప్ అశోక్ కుమార్ శివ బాలాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ దామోదర్ గుప్తా జంధ్యాల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు భీం రెడ్డి కార్యదర్శి ఆమని కార్యక్రమం నిర్వహించారు.

అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగ హక్కులను కాపాడాలి

నవతెలంగాణ - బంజారా హిల్స్



జాతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు మల్లు శివరాం,జాతీయ అధ్యక్షులు మన్నే శ్రీధర్ రావు,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా తాలూకా రాజేష్,ఉపాధక్షులుగా గోకుల కళ్యాణిలను నియమించారు. వారికి నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామక పత్రాలను శుక్రవారం అందించారు. అంబేద్కర్ ఆశయాలను,రాజ్యాంగ హక్కులను కాపాడాలని, వాడవాడలో తెలియజేయాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలను మానుకోవాలి

నవతెలంగాణ -బడంగ్‌పేట్



బీఆర్ ఎస్ పార్టీ నాయకులు బిజేపి నాయకులపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని బీజేపీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు 1,2 రాళ్ళగుడం రామకృష్ణా రెడ్డి, రామిడి వీరకర్ణా రెడ్డిలు అన్నారు.శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు నడికుడి యాదగిరి, చిత్రం శ్రీనివాస్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలనీల సమస్యలు, రోడ్లు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయని నిరసన తెలిపి కమిషనర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి,కమిషనర్ సరస్వతిలు ఈ సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వరద నీరు పోకుండా పెద్ద బావి ఆనంద్ రెడ్డి ఏకంగా నాలాను కబ్జా చేసి ఫంక్షన్ హాల్ ను నిర్మించి, కాలనీలా డ్రయినేజీల వ్యవస్థను నాశనం చేశారన్నారని ఆరోపించారు. నాలను కబ్జా చేసిన బీజేపీ నాయకులు మట్టి పోశారని మీడియా సమావేశంలో మీరు మాట్లాడటం దెయ్యాలు వేదాలను వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీల సమస్యలపై పోరాడుతున్న బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పై వ్యక్తిగత దూషణలను చేయడం మానుకోవాలని హెచ్చరించారు. నాలాను కబ్జా చేసి ఫంక్షన్ హాల్ నిర్మించి కాలనీ సమస్యలను సృష్టిస్తున్న పెద్ద బావి ఆనంద్ రెడ్డి ఫంక్షన్ హాలును కూల్చివేసి శివ సాయి నగర్ నాలా, డ్రయినేజీ సమస్యలను పరిష్కారం చూపాలని కమీషనర్, టిపిఓ, జిల్లా కలెక్టర్ ను కోరారు.

బిజినెస్

నాలుగో రోజూ నేల చూపులు

- సెన్సెక్స్ 423 పాయింట్ల పతనం
- బ్యాంక్, ఆటో స్టాక్స్‌ల్లో ఒత్తిడి



ముంబయి : దలాల్ స్ట్రీట్ వరుసగా నాలుగో రోజూ నేల చూపులు చూసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌ల్లో ఒత్తిడితో శుక్రవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 424.90 పాయింట్లు లేదా 0.56 శాతం పతనమై 75,311కి పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 117 పాయింట్లు లేదా 0.51 శాతం కోల్పోయి 117.25 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐ) విక్రయాలతో విత్త, ఐటి షేర్లు తీవ్ర ఒత్తిడికి గురైయ్యాయి. నిఫ్టీ బ్యాంకింగ్ 0.7 శాతం, పిఎస్‌యు 1.3 శాతం, ఐటి సూచీ 0.8 శాతం చొప్పున పతనమయ్యాయి. ప్రయివేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ ఏకంగా 1.5 శాతం నష్టపోయింది. ఆటో సూచీ 2.6 శాతం పతనమయ్యింది. కేంద్ర ప్రభుత్వ ఇవి పాలసీ పరిశ్రమకు ప్రతికూలంగా ఉందనే అంచనాలతో మహీంద్రా అండ్ మహీంద్రా షేర్ 6.1 శాతం, టాటా మోటార్స్ షేర్ 2.5 శాతం చొప్పున పతనమయ్యాయి.

ఎన్‌ఎస్‌ఈ -50లో ఏకంగా 35 స్టాక్స్ నష్టాలు చవి చూశాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్ వరుసగా 1.32 శాతం, 0.70 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. ఫిబ్రవరి 20న రూ.3,311 కోట్ల విలువ చేసే ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. వాణిజ్య యుద్ధ భయాలు, దేశీయంగా ఎలాంటి సానుకూల ఆర్థిక అంశాలు కానరాకపోవడంతో మదుపర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ఈ ప్రభావం గత నెల రోజులుగా మార్కెట్లలో కనబడుతోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోడీ భేటీలోనూ భారత్‌కు ఒక్క సానుకూల అంశం కానరాకపోవడం మదుపర్లను కలవరబెడుతోంది. మరోవైపు భారత్‌పై సుంకాలు తప్పక వేస్తామని ట్రంప్ ప్రకటించడం అప్పటికే వరుస నష్టాల్లో ఉన్న మార్కెట్లపై మరో పిడుగు పడినట్లయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ సన్నగిల్లడంతో ఆర్బీఐ ఇటీవల వడ్డీ రేట్లకు కోత పెట్టినప్పటికీ.. ఎలాంటి మద్దతు లభించకపోవడం విశేషం.

వేలానికి రూ.3,900 కోట్ల గో ఫస్ట్ ఆస్తులు



న్యూఢిల్లీ : దివాలా తీసిన విమానయాన సంస్థ గో ఫస్ట్ ఇండియా ఆస్తులను వేలం వేయాలని రుణదాతలు నిర్ణయించారు. ఆ సంస్థకు చెందిన ముంబయి మెట్రోపాలిటన్ ఏరియా, థానె తదితర ప్రాంతాల్లోని రూ.3,900 కోట్ల విలువ చేసే భూములను వచ్చే మార్చిలో వేలం వేయనున్నట్లు ప్రకటించాయి. ఈ తనఖా భూములను విక్రయించడం ద్వారా తాము ఇచ్చిన రుణాలను రికవరీ చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్సోరియం కలిగిన విత్త సంస్థలు స్పష్టం చేశాయి. వేలం రిజర్వు ధరను రూ.1,782 కోట్లుగా నిర్ణయించాయి. ఇప్పటికే ఈ భూములను సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాధీనం చేసుకుంది, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ తరపున మహారాష్ట్రలోని ఘోడ్‌బందర్ రోడ్ థానేకి ఆనుకుని ఉన్న 94.71 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. వాడియా రియాలిటీ ప్రయివేట్ లిమిటెడ్ పేరున ఉన్న ఈ స్థలాన్ని 2025 మార్చి 12న ఈ-వేలం వేయనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 ప్రథమార్థంలో రుణాలను రికవరీ చేసుకోగలమని ఆ బ్యాంక్‌లు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

7000 స్టోర్లలో ఐఫోన్ 16ఈ లభ్యం

- రెడింగ్టొన్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోని 7,000 పైగా రిటైల్ స్టోర్లలో ఆపిల్ ఐఫోన్ 16 ఈని అందుబాటులోకి తెస్తోన్నట్లు డింగ్టోన్ వెల్లడించింది. ఈ సంస్థ ఆపిల్ సహా ఇతర టెక్ బ్రాండ్ల ఉత్పత్తులను డిస్ట్రిబ్యూషన్ చేస్తోంది. ఐఫోన్ 16 ఈ ప్రీ బుకింగ్స్‌ను ఫిబ్రవరి 21 నుంచే ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 28 నుంచి డెలివరీ, విక్రయాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఈ స్మార్ట్‌ఫోన్ ఎ18 చిప్, 48 ఎంపీ 2ఇన్ 1 కెమెరా సిస్టమ్‌ను కలిగి ఉంది.

కొత్త ప్రసార సేవల చట్టానికి సిఫారసులు

- విడుదల చేసిన ట్రాయ్



న్యూఢిల్లీ : కొత్త ప్రసార సేవల చట్టం కోసం పలు సిఫారసులను ప్రతిపాదిస్తూ టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఓ రిపోర్ట్‌ను విడుదల చేసింది. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 ప్రకారం ప్రసార సేవలను అందించడం కోసం సర్వీస్ ఆథరైజేషన్ల కోసం దీన్ని ప్రతిపాదించింది. ఐపీటీవీ సర్వీసులను అందించడానికి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌లకు కనీస నికర విలువ రూ.100 కోట్లను తొలగించాలని ఇందులో ప్రతిపాదించింది. రేడియో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌కి సంబంధించిన నిబంధనలు, షరతులు, డిజిటల్ టెక్నాలజీని స్వీకరించడానికి వీలుగా పలు సిపారసులు చేసింది. టెరెస్ట్రియల్ రేడియో సర్వీస్ కోసం ఫ్రీక్వెన్సీ అసైన్‌మెంట్ కోసం స్పెక్ట్రమ్ వేలం విడిగా జరుగుతుందని ట్రాయ్ పేర్కొంది. ఇప్పటికే ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని రద్దు చేసి టెలికమ్యూనికేషన్స్ చట్టం (2023)ను నోటిపై చేసినట్టు గుర్తు చేసింది. టెలికమ్యూనికేషన్స్ చట్టంలోని సెక్షన్ 3 (1)(ఎ) ప్రకారం ప్రసార సేవా అధికారాలు మంజూరు చేయాలని సిఫారసులలో ప్రతిపాదించింది. ప్రసార సేవల విషయంలో మైగ్రేషన్ కోసం ప్రాసెసింగ్ రుసుము లేదా ప్రవేశ రుసుము అవసరం లేదని పేర్కొంది. సర్వీస్ ప్రొవైడర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, సర్వీస్ ఆథరైజేషన్స్ (జాతీయ భద్రతకు సంబంధించిన కారణాలు మినహా) నిబంధనలు, షరతులకు, సవరణలకు సిఫారసులు అవసరమని సూచించింది.

జాతీయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- నేటి నుంచి రాష్ట్ర వ్యాప్త ప్రచారం :

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరిబండి ప్రసాదరావు, నున్నా నాగేశ్వరరావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, జయరాజుతో కలిసి ఆయన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఈ ముసాయిదాపై (ఫిబ్రవరి 22 నుంచి 28 వరకు) ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన విధానమేనన్నారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త విధానంలో కనీస మద్దతు ధరలకు (ఎంఎస్పీ) చట్టబద్ధ హామీపై స్పష్టత లేదని విమర్శించారు. ఎమ్ఎస్‌పీకి రక్షణ లేకుండా రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టమన్నారు. కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోతారని తెలిపారు. రైతులు గిడ్డంగుల్లో తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశం ఉండదని చెప్పారు. వ్యాపారులు రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందే అవకాశం ఉందని తెలిపారు. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని చెప్పారు. వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కర్ణాటకలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్

నవతెలంగాణ హైదరాబాద్: శామ్‌సంగ్ R&D ఇన్స్టిట్యూట్ ఇండియా, బెంగళూరు (SRI-B) కర్ణాటకలోని మొట్టమొదటి మహిళా ఇంజనీరింగ్ కళాశాల, గీతా శిశు శిక్షణ సంఘ (GSSS) ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, మైసూరులో శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ గ్లోబల్ సిటిజన్‌షిప్ ప్రోగ్రామ్, శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ (SIC)ను ప్రారంభించింది. ఈ చొరవ STEMలో లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి మరియు సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త తరం మహిళా నాయకులను ప్రోత్సహించడానికి శామ్‌సంగ్ యొక్క అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుంది.

అరెకటికలను ఎస్‌సీ జాబితాలో చేర్చలన్న పిటిషన్ తిరస్కరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సీ) జాబితాలో అరెకటిక (ఖాతిక్) కమ్యూనిటీని చేర్చేలా ఆదేశాలు జారీ చేయాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తెలంగాణ రాష్ట్ర అరెకటిక (ఖాతిక్) సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు ఈ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోలేమని పేర్కొంది. అటువంటి విషయాలలో కోర్టు జోక్యం వల్ల కలిగే పరిణామాలను స్పష్టం చేయడానికి మణిపూర్ సంక్షోభాన్ని ప్రస్తావించింది. ఈ అంశంలో కోర్టు జోక్యం చేసుకోలేదని, పార్లమెంట్‌కే ఆ అధికారం ఉందని పేర్కొంది.

"కోర్టు దీనిని పరిశీలించదు. పార్లమెంటు మాత్రమే దీన్ని చేయగలదు. మణిపూర్‌లో ఏమి జరిగిందో మీకు తెలుసు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మెయిటీ కమ్యూనిటీని షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని మణిపూర్ హైకోర్టు 2023 మార్చిలో ఇచ్చిన తీర్పు రాష్ట్రంలో పెద్ద ఎత్తున అల్లర్లు, రక్తపాతానికి దారితీసిందని కోర్టు ప్రస్తావించింది. ఆ తీర్పులోని ఆదేశాన్ని తరువాత హైకోర్టు తన సమీక్ష అధికారాలను ఉపయోగించి తొలగించిందని పేర్కొంది. సుప్రీంకోర్టు ముందు దాఖలైన పిటిషన్‌లో హిందువుల్లో కసాయిలుగా పనిచేసే అరెకటికులను దేశంలో సమానంగా చూడటం లేదని, ఎందుకంటే వారు కొన్ని రాష్ట్రాల్లో ఎస్‌సిలుగానూ, మరికొన్ని రాష్ట్రాల్లో ఓబీసీ జాబితాలో ఉన్నారని, కనుక దేశవ్యాప్తంగా ఎస్‌సీ జాబితాలో చేర్చాలని పిటిషన్ తరపు న్యాయవాదులు కోరారు."అరెకటిక/ఖాతిక్ కమ్యూనిటీ స్థానిక కుల్లో అత్యల్ప హోదాలో ఉన్నారు. ఎందుకంటే వారు మాంసాహారులు అమ్మి జీవిస్తారని, అలాగే అపరిశుభ్రమైన, అగౌరవప్రదమైన ....వ త్తిలో నిమగ్నమై ఉన్నారు. 'కసాయి', కసబ్, కటికవాడు, కటికా అనే పదాన్ని క్రూరమైన, దయలేని వ్యక్తులకు ఉపయోగిస్తారు. వారు తమ సొంత దేవాలయాలను స్థాపించారు. వాటిని స్వయంగా నిర్వహిస్తారు. వారికి వారి స్వంత కమ్యూనిటీ పూజారులు ఉన్నారు. వారు స్వయంగా నిర్వహించే ప్రతి జిల్లా/నగరంలో వారికి ప్రత్యేక శ్మశానవాటిక ఉంది " అని పేర్కొన్నారు. తమ కులానికి చెందిన మహిళ వేరే రాష్ట్రంలో వివాహం చేసుకుంటే ఆమె ఎస్‌సి హోదా కోల్పోతుందని, ప్రజలు తమ నివాసాలను మార్చుకున్నప్పుడు కూడా ఇదే జరుగుతుందని పేర్కొన్నారు.

అవసరం ఎంతో..అడిగింది స్వల్పం

- ఆశ్చర్యం గొల్పుతున్న సాగునీటిశాఖ బడ్జెట్ ప్రతిపాదనలు
- 2025-26 ఆర్థికానికి రూ.38,648 కోట్ల ప్రతిపాదన
- లక్ష్యం నెరవేరదంటున్న నిపుణులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర నీటిపారుదల రంగం పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కిలా ఉంది. ఆయా రంగాలకు అవసరమైనంత మేరకు బడ్జెట్ కేటాయింపులు చేసుకోవడంలో పాలకవర్గాలు తడబడుతున్నాయి. నిర్లక్ష్యం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు, వ్యవస్థల అవసరాలను శాస్త్రీయ దృష్టితో కాకుండా ఎన్నికలు, ఓట్లు, రాజకీయాల కోణంలో నిధులు ఇస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. జనానికి కష్టాలు, కడగండ్లే మిగులుతున్నాయి. ప్రాధాన్యతా రంగాలకు రొక్కం పలుచబడుతున్నది. దీంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు వెనుకపట్టుపడుతున్నాయి. ప్రధానంగా రాష్ట్ర సాగునీటిపారుదల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాల విధానం పాక్షికంగానే అమలైంది. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే పాత తోవలోనే వెళుతున్నది. దీనికి నిధుల కొరతను కారణంగా చెబుతున్నది. గత ప్రభుత్వం చేసిన అప్పులను బూచిగా చూపెడుతున్నది. పథకాలు, ప్రాజెక్టుల పేర్లు మార్చి గారడీ చేస్తున్నది. సాగునీటి శాఖ తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంపిన అంచనాలు రాష్ట్ర సాగునీటి అవసరాలను నెరవేర్చేవిగా లేవు. భారీగా నిధులు అవసరమైనా, సర్కారును అడగడానికి సైతం జంకుతుండటం గమనార్హం. పంపిన ప్రతిపాదనల్లోనూ అధికమొత్తం ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చుల కిందకే వెళ్తుండటమూ తెలిసిందే.

ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది ?

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అవసరాలకు భారీగా నిధులు కావాల్సి ఉంటుంది. ఏడాది క్రితం పాత ఇంజినీర్ ఇన్ చీఫ్ సి.మురళీధర్ 'రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలంటే సుమారు రూ. లక్ష కోట్లు' అవసరమని చెప్పారు. కానీ ప్రభుత్వాల అవసరాలు మాత్రం మరోరకంగా ఉంటున్నాయి. ప్రతిష్టాత్మకంగా గత సర్కారు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా రూ. 22 వేల కోట్లు కావాలి. అలాగే కల్వకుర్తికి రూ.1000 కోట్లు అవసరం. బీమాకు మరో రూ. 500 కోట్లు లేకపోతే అంతే. కోహిల్ సాగర్‌కు కనీసం రూ.200 కోట్లు కావాల్సిందేనని అధికారులే అంటున్నారు. పాలమూరు-రంగారెడ్డి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. కాలువల కోసం రూ. 5 వేల కోట్లు, భూసేకరణ కోసం రూ. 1000 కోట్లు, పంపుహౌజ్ పనులకుగాను రూ.1000 కోట్లు అవసరం. 12.5 లక్షల ఎకరాలను ఖాస్తులోకి తీసుకురావాలన్నా, ఈ ప్రాజెక్టును పట్టా లెక్కిం చాలన్నా మొత్తం రూ. 10 వేల కోట్లు తప్పనిసరి అని సమాచారం. ఆర్డీఎస్‌కు రూ. 100 కోట్లు, దేవాదుల భూసేకరణకు రూ. 500 కోట్లు కేటాయించాలి. మొత్తం సాగునీటి శాఖల తక్షణ అవసరాల కోసం రూ. 10 వేల కోట్లు అదనంగా కావాలి. కాగా గతంలో మంత్రులు చేసిన సమీక్షలో రూ.20 నుంచి 25 వేల కోట్లు అవసరమని సెలవిచ్చారు.

తాజా ప్రతిపాదనలివిగో

2025-26 ఆర్థిక సంవత్సరానికి సాగునీటి శాఖ రూ.38,648 కోట్లను ప్రతిపాదనల కింద సర్కారుకు పంపింది. గత ఏడాది రూ.22,301 కోట్లు ప్రతిపాదించారు. తాజాగా కొంత పెంచినా, రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఖర్చుల కింద పోతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ చాలా కీలకమైన అంశం. అన్ని ప్రాజెక్టులకుగాను 10 నుంచి 15 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణకు రూ. 20 నుంచి 25 వేల కోట్లు కావాల్సి ఉంటుందని సమాచారం. కాగా పునరావాస సమస్యల పరిష్కారానికి రూ.1.95 కోట్లు మాత్రమే ప్రతిపాదించడం గమనార్హం. కాగా ప్రభుత్వం బడ్జెట్‌లో ఎంత కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే.

నేడు రైతులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు

- ఫిబ్రవరి 14న జరిగిన చర్చలకు కొనసాగింపు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నేడు రైతులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపనుంది. చండీగఢ్‌లో ఫిబ్రవరి 14న జరిగిన చర్చలకు కొనసాగింపుగానే ఈ చర్చలు జరగనున్నాయి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ సహా రైతు డిమాండ్లపై చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశం గురించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పూర్ణ చంద్ర కిషన్ రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పాంధర్‌లకు లేఖ పంపారు. "ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో జరిగిన ఎస్‌కెఎం (నాన్-పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నాయకులతో జరిగిన మునుపటి సమావేశానికి కొనసాగింపుగా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు. "రైతు సంఘాల డిమాండ్లకు సంబంధించి ఫిబ్రవరి 22న చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో కేంద్ర ప్రభుత్వం, పంజాబ్ ప్రభుత్వ మంత్రులతో సమావేశం నిర్వహించబడింది. సమావేశానికి మిమ్మల్ని (రైతు నేతలు) సాదరంగా ఆహ్వానిస్తున్నాం" అని లేఖలో పేర్కొన్నారు.రైతు పండించే పంటలకు ఎంఎస్‌పి చట్టబద్ధమైన హామీతో సహా రైతుల వివిధ డిమాండ్లపై రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరుగనుంది. శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద ఆందోళనకు నాయకత్వం వహించిన రెండు వేదికల రైతు ప్రతినిధులు పాల్గొన్న ఫిబ్రవరి 14న జరిగిన సమావేశంలో పంజాబ్ వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియాన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి లాల్ చంద్ కటారుచక్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రైతు ప్రతినిధులతో మరో రౌండ్ చర్చలు చండీగఢ్‌లో జరుగుతాయని, దీనిలో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్రబృందానికి నాయకత్వం వహిస్తారని, తాను కూడా పాల్గొంటానని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. అయితే రైతు సంఘం నేత దల్లేవాల్ మాత్రం ఎంఎస్‌పీ పంజాబ్‌కు మాత్రమే కాదని, దేశం మొత్తం రైతులకు ఎంఎస్‌పీ కావాలని అవసరమని అన్నారు. అయితే ఫిబ్రవరి 14 సమావేశానికి ముందు, ఫిబ్రవరిలో కేంద్ర మంత్రులు, నిరసన తెలుపుతున్న రైతుల మధ్య నాలుగు రౌండ్ల సమావేశాలు జరిగాయి. కానీ చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

రైతులు పండించిన పంటలకు చట్టపరమైన హామీతో పాటు, రైతులు రుణ మాఫీ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీల పెంపుదల ఉండకూడదని, పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని, 2021 లఖింపూర్ ఖేరీ హింస బాధితులకు "న్యాయం" చేయాలని రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించడం, రైతు ఉద్యమంలో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

యూఎస్ ఎయిడ్ సాయంపై రాద్ధాంతం

వీణా రెడ్డిపై నజర్



న్యూఢిలీ : భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యూఎస్ ఎయిడ్ సంస్థ 21 మిలియన్ డాలర్ల సాయాన్ని అందజేసిందని, ఇది విదేశీ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే అవుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన మరు క్షణమే మన దేశంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. ఈ 'జోక్యం'లో కాంగ్రెస్ ప్రమేయం ఉన్నదని బీజేపీ ఆరోపించింది. అంతేకాక భారత్, భూటాన్ దేశాల్లో చేపట్టిన అంతర్జాతీయ అభివృద్ధి మిషన్‌కు యూఎస్ ఎయిడ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న వీణా రెడ్డి పేరును బయటికి లాగింది. ఆమె ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. మన దేశంలో యూఎస్ ఎయిడ్‌కు నేతృత్వం వహించిన తొలి భారతీయ అమెరికన్ వీణారెడ్డే. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి యూఎస్ ఎయిడ్ సంస్థ నిధులు అందజేయడంపై ఎలన్ మస్క్ ఆరోపణలు గుప్పించిన తర్వాత బీజేపీ లోక్‌సభ సభ్యుడు నిషికాంత్ దూబే మాట్లాడుతూ భారత్‌లోని కొన్ని సంస్థలకు కూడా ఆ సంస్థ నిధులు సమకూర్చిందని, ఆ సంస్థలు దేశంలో అశాంతిని సృష్టించేందుకు కృషి చేశాయని చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

బీజేపీ రాజ్యసభ సభ్యుడు, న్యాయవాది మహేష్ జెత్మలానీ తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ పెడుతూ 'వీణా రెడ్డిని 2021లో యూఎస్ ఎయిడ్ మిషన్ డైరెక్టర్‌గా భారత్‌కు పంపారు. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆమె భారత్‌ను వదిలి వెళ్లిపోయారు. భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యూఎస్ ఎయిడ్ నిధులు అందించడంపై కేంద్ర సంస్థలు చేపట్టే దర్యాప్తు నుండి తప్పించుకోవడానికే ఆమె దేశం విడిచి వెళ్లిపోయారు. భారత్‌లో అమెరికా అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టీతో కలిసి ఆమె పనిచేశారు' అని ఆరోపించారు.

ఎవరీ వీణా రెడ్డి ?

భారత్‌లోని అమెరికా ఎంబసీ, కాన్సులేట్ వెబ్‌సైట్ ప్రకారం...యుఎస్ ఎయిడ్‌తో వీణా రెడ్డికి అనేక సంవత్సరాలుగా సంబంధం ఉంది. ఆమె అందులో కీలక పాత్ర పోషించారు. గతంలో ఆమె అమెరికా ఫారిన్ సర్వీస్ అధికారిగా పనిచేశారు. కాంబోడియాలో యూఎస్ ఎయిడ్ మిషన్ డైరెక్టరుగా, హైతీలో యూఎస్ ఎయిర్ మిషన్ డిప్యూటీ డైరెక్టరుగా, వాషింగ్టన్ డీసీలో అసిస్టెంట్ జనరల్ కౌన్సిల్‌గా (ఆసియా, మధ్య ప్రాచ్యంలో యుఎస్ ఎయిడ్ కార్యకలాపాల న్యాయ వ్యవహారాలు) వ్యవహరిస్తున్నారు. అంతేకాక న్యూయార్క్, లండన్, లాస్ ఏంజెల్స్‌లో కార్పొరేట్ అటార్నీగానూ పనిచేశారు. కొలంబియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుండి డాక్టరేట్‌ను, యూనివర్సిటీ ఆఫ్ చికాగో నుండి ఎంఏ, బీఏ డిగ్రీలనూ పొందారు.2017లో కాంబోడియాలో యూఎస్ ఎయిడ్ మిషన్ డైరెక్టరుగా ఉన్నప్పుడు ఆమె కింద 75 మంది సిబ్బంది ఉండేవారు. ఆహార భద్రత, పర్యావరణం, ఆరోగ్యం, విద్య, బాలల సంరక్షణ, ప్రజాస్వామ్యం, పాలన వంటి పలు రంగాల్లో యూఎస్ ఎయిడ్ కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించే వారు. హైతీలో భూకంపం తర్వాత చేపట్టిన పునర్నిర్మాణ పనులు, ఎన్నికలు, ఆర్థిక వృద్ధి, ఆహార భద్రత, హరికేన్ వంటి వాటిని కూడా పర్యవేక్షించారు. అయితే విదేశాలకు అందిస్తున్న అన్ని రకాల సాయాలను ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసిన విషయం తెలిసిందే.

TIER IV, ఆటోవేర్ ఫౌండేషన్, NSDCతో NxtWave భాగస్వామ్యం

నవతెలంగాణ హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద స్వయం ప్రతిపత్తి కలిగిన వాహనఅభివృద్ధి సముదాయాన్ని నిర్మించేందుకు టైయర్ IV (TIER IV), ఆటోవేర్ ఫౌండేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC)లతో భాగస్వామ్యం కుదుర్చుకున్న నెక్స్ట్ వేవ్ (NxtWave) ఈ నూతన భాగస్వామ్యం 4.0 టెక్నాలజీలలో 30 లక్షల మంది విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచే లక్ష్యంతోప్రారంభించిన NxtWave స్కిల్‌అప్‌ఇండియా 4.0 ప్రయత్నానికి మద్దతుఇస్తుంది.
నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC)
భాగస్వామ్యంతోప్రారంభించిన స్కిల్‌అప్ ఇండియా 4.0ప్రభావాన్ని మరింతగా పెంచుతూ, అభివృద్ధిచెందుతున్న సాంకేతికతలలో భారతదేశ యువతకు నైపుణ్యాన్ని పెంచడంలో నెక్స్ట్ వేవ్ (NxtWave) అగ్రగామిగా ఉంది. అధికారికంగా ప్రపంచంలోనే అతిపెద్దఅటానమస్ వెహికల్ (AV) డెవలపర్సముదాయాన్ని నిర్మించేందుకు జపాన్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన అటానమస్ డ్రైవింగ్కోసం ప్రపంచంలోని మొట్టమొదటి ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్ వెనుక ఉన్న మార్గదర్శకశక్తి TIER IV, అటానమస్ డ్రైవింగ్ కోసంప్రపంచంలోని ప్రముఖ ఓపెన్-సోర్స్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ ఆటోవేర్ ఫౌండేషన్‌తోభాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సంచలనాత్మక భాగస్వామ్యం ప్రపంచ భౌతిక కృత్రిమ మేధస్సు (AI) విప్లవంలోభారతదేశాన్ని ముందంజలో ఉంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

ఊహించని మలుపుల నుంచి నాన్-స్టాప్ నవ్వుల వరకు- టాటా ప్లే తెలుగు సినిమాలో జనక అయితే గనక

నవతెలంగాణ హైదరాబాద్: కొన్ని సినిమాలు మిమ్మల్ని నవ్విస్తాయి, కొన్ని ఆలోచించేలా చేస్తాయి, మరికొన్ని రెండింటినీ అప్రయత్నంగా చేయిస్తాయి. జనక అయితే గనక ఆ రెండవ కోవకు చెందిన సినిమా. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రసాద్‌గా సుహాస్ మరియు సంగీత విపిన్ అతని భార్యగా నటించారు. ఈ చిత్రం హాస్యం, భావోద్వేగాలు మరియు సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే ఆహ్లాదకరమైన సమ్మేళనం. ఫ్రెష్ కంటెంట్‌తో, సంబంధిత పాత్రలతో, ఇది కేవలం కామెడీ కన్నా ఎక్కువ- ఇది వినోదాత్మక కుటుంబ నాటకం అని చెప్పవచ్చు. ఇది మిమ్మల్ని నవ్విస్తుంది, కళ్లు చెమర్చేలా చేస్తుంది అలాగే జీవితంలోని చిన్న వ్యంగ్య సందర్భాలను ప్రతిబింబిస్తుంది. ఫిబ్రవరిలో ప్రతిరోజూ టాటా ప్లే తెలుగు సినిమా, సర్వీస్ 1402లో మాత్రమే దీన్ని వీక్షించేందుకు సిద్ధంగా ఉండండి.

MG విండ్సర్ 15,000 ఉత్పత్తి మైలురాయిని సంబరం చేసిన JSW MG మోటార్ ఇండియా

నవతెలంగాణ హైదరాబాద్: MG విండ్సర్ భారతదేశపు మొదటి ఇంటిలిజెంట్ CUV 15,000 యూనిట్ల మైలురాయి ఉత్పత్తిని దాటిందని జేఎస్ డబ్ల్యూ MG మోటార్ ఇండియా ఈ రోజు ప్రకటించింది. CUV ఆరంభమైన నాటి నుండి వరుసగా నాలుగు నెలలు (అక్టోబర్ 2024-జనవరి 2025) బెస్ట్-సెల్లింగ్ EVగా అభివృద్ధి చెందింది, భారతదేశంలో EV విభాగం యొక్క పూర్తి అభివృద్ధికి కూడా తోడ్పడింది. ఈ సందర్భంగా, బిజు బాలేంద్రన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, జేఎస్ డబ్ల్యూ MG మోటార్ ఇండియా ఇలా అన్నారు, "MG విండ్సర్ అందుకుంటున్న ప్రతిస్పందన చూసి మేము ఎంతో ఆనందించాము మరియు 15,000 ఉత్పత్తి మైలురాళ్లను దాటడానికి మాకు సహాయపడిన కస్టమర్లకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

అణుశక్తి గురించి అవగాహన కల్పించిన NPCIL 'ఆటమ్ ఆన్ వీల్' ప్రచారం

నవతెలంగాణ హైదరాబాద్: అణుశక్తి యొక్క వివిధ ఉపయోగకరమైన అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి "ఆటమ్ ఆన్ వీల్" పేరిట మొబైల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రత్యేక ప్రచారం నవంబర్ 13, 2024న శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించబడింది. నవంబర్, డిసెంబర్, 2024 మరియు జనవరి, 2025 సహా గత 3 నెలల్లో, ఈ వినూత్న ప్రచారం ద్వారా దాదాపు 64755 మందికి అణుశక్తి గురించి సమాచారం అందించబడింది. ప్రత్యేక అంశాలు మరియు సృజనాత్మక విధానంతో, ఈ ఎగ్జిబిషన్ శ్రీకాకుళం మరియు విజయనగరం జిల్లాలోని 15 కంటే ఎక్కువ మండలాల్లోని సుమారు 139 గ్రామాల పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీ మార్కెట్లు మొదలైన వాటిని సందర్శించడం ద్వారా విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన సాధారణ ప్రజలను విజయవంతంగా అవగాహన కల్పించింది. జనవరి, 2025 చివరి నుంచి ఫిబ్రవరి 12 వరకు, శ్రీకాకుళం, విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాలోని 71 గ్రామాలలో అణుశక్తి యొక్క సామాజిక ఉపయోగాల గురించి సుమారు 12904 మందికి సమాచారం అందించబడింది. ఈ ప్రచారానికి విద్యార్థులు, మహిళలు, యువత, గ్రామ పంచాయతీ సభ్యులు, సాధారణ గ్రామస్తులు మరియు ఇతర ప్రజల నుండి భారీ మద్దతు మరియు మంచి సహకారం లభించింది.

ఫిన్‌టెక్ వర్క్‌షాప్, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ సెషన్‌లను నిర్వహించిన KLH గ్లోబల్ బిజినెస్ స్కూల్

నవతెలంగాణ హైదరాబాద్: ఇమార్టికస్ లెర్నింగ్ మరియు PwC సహకారంతో KLH గ్లోబల్ బిజినెస్ స్కూల్, "ఫిన్‌టెక్ ఆవిష్కరించబడింది: ధోరణులు , ఆవిష్కరణ & ప్రత్యక్ష పరిష్కారాలు" ("ఫిన్‌టెక్ అన్వీల్డ్ : ట్రెండ్స్, ఇన్నోవేషన్ & లైవ్ సొల్యూషన్స్) అనే వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో PwC నుండి విశిష్ట వక్తలు పాల్గొన్నారు, వీరిలో అసోసియేట్ డైరెక్టర్ శ్రీ రాఘవ్ అగర్వాల్, సీనియర్ కన్సల్టెంట్ శ్రీ విఘ్నేష్ వెంకటరామన్ మరియు అసోసియేట్ శ్రీ అర్హం కుమార్ జైన్ తో పాటుగా ఇమార్టికస్ లెర్నింగ్ డిగ్రీ ప్రోగ్రామ్ లెర్నింగ్ హెడ్ డాక్టర్ క్షమా శర్మ ఉన్నారు. ఈ సెషన్ లలో ప్రధాన ఆకర్షణగా వివిధ కేస్ స్టడీస్‌పై విద్యార్థుల ప్రదర్శనలు ఉన్నాయి. ఇది PwC స్పీకర్ల నుండి విలువైన అభిప్రాయాన్ని మరియు పరిజ్ఞానం తో గల సూచనలను అందుకుంది, ఇది వారి అభ్యాస అనుభవాన్ని మరింత మెరుగుపరిచింది. ఈ సెషన్‌లు విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ పోకడలు, వినూత్న వ్యాపార నమూనాలు మరియు వాస్తవ-ప్రపంచ వినియోగాల గురించి సమగ్ర అవగాహనను అందించాయి. ఇంటరాక్టివ్ చర్చలు మరియు కేస్ స్టడీస్ ద్వారా, వర్క్‌షాప్ విద్యార్థులకు వారి కెరీర్‌లకు అవసరమైన ఆచరణాత్మక పరిశ్రమ జ్ఞానాన్ని అందించింది.